www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -163 మంగళవారం 29 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..

అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం

రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు

సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత

ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు




## ప్రమాదకర పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్రం నిషేధం

మనుషులు, జంతువుల ఆరోగ్యానికి ప్రమాదకరమని వెల్లడి

నిషేధ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం

ఈ విషానికి విరుగుడు లేకపోవడమే ప్రధాన ఆందోళన




## ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

రూ. 50 లక్షల ఈడీ అటాచ్‌మెంట్‌ను రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్

డబ్బు ఏసీబీ అధీనంలో ఉన్నందున జప్తు చెల్లదని తీర్పు

రేవంత్ రెడ్డి సహా మరో ముగ్గురికి అనుకూలంగా ఉత్తర్వులు



**ఢిల్లీ సెప్టెంబరు 28 ,(ప్రజావినికిడి):** 2015 నాటి సంచలనాత్మక 'ఓటుకు నోటు' కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన రూ. 50 లక్షల ఆస్తుల జప్తు (అటాచ్‌మెంట్) **మిగతా 2లో...**

మిగతా 2లో...

# గుజరాత్ వర్సెస్ దేశం

## కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య

ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరానన్న రేవంత్

తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సహకరించడం లేదని విమర్శ



**హైదరాబాద్ సెప్టెంబరు 28,(ప్రజావినికిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన 'ప్రతిదిన్' దినపత్రిక "భారత్ తదుపరి అధ్యాయం" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. **మిగతా 2లో...**

## రూ.11 వేల కోట్లతో పల్లె పండుగ

నేడు పల్లె పండుగ 3.0 కి శ్రీకారం

నెల్లూరు జిల్లా ఉదయగిరిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




అమరావతి, సెప్టెంబరు 28 ,(ప్రజావినికిడి): పల్లెల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధివెలుగులు నింపనుంది. పల్లె పండుగ 3.0కు శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా రూ. 11,085 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో భారీఎత్తున అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టనున్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ పనులుప్రారంభం కానున్నాయి. గ్రామాల్లో రూ. 2,700 కోట్ల వ్యయంతో6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరగనుంది. రూ. 7,550కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులను చేపట్టనుంది. రూ. 300 కోట్లతో పాడి రైతుల కోసం 22,000 మినీ గోకులాలనుప్రభుత్వం నిర్మించనుంది. మరో రూ. 7,550 కోట్ల వ్యయంతో 9,500కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులకు అంకురార్పణ చేయనున్నారు. **మిగతా 2లో...**




## నాలుగేళ్లు చదివితేనే స్థానికత

తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన

స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం

రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

## సీఐ అలీ మృతిలో కొత్త కోణం..

విజయవాడ సీఐ షేక్ అహ్మద్ అలీ మృతిపై అనుమానాస్పద మృతిగా కేసు

నిరసనకారులు తోయడం వల్లే ఆయన కిందపడ్డారని కానిస్టేబుల్ ఫిర్యాదు

కింద పడ్డాకే శ్వాస ఇబ్బందులు తలెత్తి గుండెపోటు వచ్చిందని వెల్లడి

కానిస్టేబుల్ సుధాకర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**విజయవాడ సెప్టెంబరు 28,(ప్రజావినికిడి):** విజయవాడలో బందోబస్తు విధుల్లో అస్వస్థతకు గురై మరణించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) షేక్ అహ్మద్ అలీ (54) మృతి కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఇది సహజ మరణం కాదని, తోపులాటలో ఆయన కిందపడిపోవడమే మృతికి కారణమని తోటి సిబ్బంది ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. **మిగతా 2లో...**



## అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదు

### సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి




ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ

నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ

రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి

అమరావతి, **సెప్టెంబరు 28 ,(ప్రజావినికిడి):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు.

**మిగతా 2లో...**

### తులం బంగారం ఇస్తామన్న వాళ్ల ఫొటోలు

## పోలీస్ స్టేషన్లలో పెట్టాలి!

భూములకు పట్టాలు ఇప్పించమని అడుగుతున్న రైతుల ఫొటోలు కాదు

రైతుల మీదకు 4 వేల మంది పోలీసోళ్లను పంపిస్తారా? ఇదేమైనా దండయాత్రా?

బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు బాధిత రైతులతో కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 28,(ప్రజావినికిడి):** తులం బంగారం ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత ఆ హామీలను మర్చిపోయిన వాళ్ల ఫొటోలు పోలీస్ స్టేషన్‌లో పెట్టాలేగానీ రైతులవి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ భూములకు పట్టాలు ఇప్పించమన్న రైతుల ఫోటోలను పోలీసులతో ఎందుకు తీయించారని ప్రభుత్వాన్ని నిలదీశారు. లంగలు, దొంగలు, ప్రజలకు మాట ఇచ్చి తప్పిన మోసగాళ్ల ఫొటోలే పోలీస్ స్టేషన్లలో ఉండాలన్నారు. న్యాయం చేయమని కోరుతున్న రైతులను వేధించడం దుర్మార్గమన్నారు. **మిగతా 2లో...**



## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ

అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ

హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదు

**మొదటిపేజీ తరువాయి**

దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# నాలుగేళ్లు చదివితేనే స్థానికత

### తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

**ఢిల్లీ సెప్టెంబరు 28 ,(ప్రజావినికిడి):**

తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.

ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులోని ఇతర నిందితులకు కూడా అనుకూలంగా ఈ తీర్పు వెలువడింది.జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 14న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 50 లక్షల నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసి, ట్రయల్ కోర్టులో జమ చేసిందని పిటిషనర్లు తమ వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ట్రైబ్యునల్, వివాదాస్పద నగదు ఇప్పటికే కోర్టు అధీనంలో ఉన్నప్పుడు, దానికి సమానమైన మరో మొత్తాన్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. నిందితులు ఆ ఆస్తులను బదిలీ చేసే అవకాశం లేనందున ఈడీ అటాచ్‌మెంట్ అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.2015లో రేవంత్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఈ కేసు నమోదైంది. నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ. 5 కోట్ల ఒప్పందంలో భాగంగా రూ. 50 లక్షల అడ్వాన్స్ ఇవ్వజూపారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఆ రూ.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ తెలిపింది. ఈ ఏసీబీ కేసును ఆధారంగా చేసుకునే ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఆస్తులను అటాచ్ చేసింది. ఈడీ అటాచ్‌మెంట్‌ను ఖరారు చేస్తూ 2022లో వెలువడిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్, ఉదయ్ సింహా, బిషప్ హ్యారీ సెబాస్టియన్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది.

# గుజరాత్ వర్సెస్ దేశం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు. దేశం నిధులను గుజరాత్‌కు మాత్రమే తరలిస్తున్నారని, అందుకే ఇది గుజరాత్ వర్సెస్ దేశం అనే పోరాటంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు పాల్పడుతోందని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా పేదలు, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, భవిష్యత్తులో మరిన్ని ఓట్లు తొలగించే ప్రణాళికతో ఉన్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు.తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై రెండుసార్లు గెలిచానని, అయితే నాటి ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరానని తెలిపారు. 2014 తర్వాత తెలంగాణలో పోరాటం ప్రధానంగా కేసీఆర్‌కు, తనకు మధ్యనే జరిగిందని, తాను అసెంబ్లీలో కంటే జైలులోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2017లో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరానని, ఆయనే తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత ఎజెండా లేదని, ఆయన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రూ.11 వేల కోట్లతో పల్లె పండుగ

**మొదటిపేజీ తరువాయి**

అలాగేరూ. 225 కోట్ల వ్యయంతో ఉద్యానవన శాఖ ద్వారా 50,000 ఎకరాల్లోతోటల పెంపకం, రూ.110 కోట్ల వ్యయంతో 1,000 కిలోమీటర్ల మేజిక్‌డ్రెయిన్ల నిర్మాణంకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.రూ. 200 కోట్లతో బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర పనులకు ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేయనుంది.మొత్తం రూ.11,085 కోట్లతో కేంద్ర వాటాగా రూ.5,391 కోట్లు, రాష్ట్ర వాటా రూ.5,694 కోట్లు ఖర్చు చేయనుంది. వీబీ–జీ రామ్ జీకింద రూ.1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ.3,800కోట్లు, నాబార్డ్, సాస్కీ, ఇతర నిధులతో రూ.2,000 కోట్లతో పనులనుప్రభుత్వం చేపట్టనుంది.ఇదిలా ఉండగా పల్లె పండుగ 1.0 కింద 4 వేల కి.మీ సిసి రోడ్లు,22,514 పశువులషెడ్లు, 21,000 వ్యవసాయ పంట కుంటలు, 64 వేలఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం పంచాయతీ రాజ్ అండ్ రూరల్‌డెవలప్మెంట్ శాఖ ఇప్పటికే చేపట్టింది. అలాగే పల్లె పండుగ 2.0 కిందరూ. 2,500 కి.మీ సీసీ రోడ్లు, 8 వేల 300 కి.మీ బీటీ రోడ్లు, 15750పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయకుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కీ.మీ మ్యాజిక్ డ్రైన్లనిర్మాణం పూర్తి చేసింది.తాజాగా పల్లె పండుగ 3.0 కింద రూ.11,085 కోట్లతో గ్రామీణప్రాంతాల్లో భారీ ఎత్తున పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిపల్లెల్లో ప్రగతి వెలుగులు నింపనుంది.

# స్టార్‌షిప్ చరిత్రాత్మక ప్రయోగం.. భారత్ మీదుగా భూమి చుట్టూ 6 సార్లు ప్రదక్షిణ!

**ఢిల్లీ సెప్టెంబరు 28,(ప్రజావినికిడి):**

ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'స్పేస్‌ఎక్స్' మరో చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. ఆ సంస్థ అభివృద్ధి చేసిన భారీ స్టార్‌షిప్ రాకెట్‌ను తొలిసారిగా కక్ష్యలోకి పంపనుంది. 'ఫ్లైట్ 14'గా వ్యవహరిస్తున్న ఈ ప్రయోగం ఈరోజు (సోమవారం, సెప్టెంబర్ 28) భారత కాలమానం ప్రకారం సాయంత్రం ప్రారంభం కానుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ ప్రయోగం నిర్ణీత సమయానికే జరగనుంది.ఈ ప్రయోగంలో భాగంగా స్టార్‌షిప్ భూమికి సుమారు 275 కిలోమీటర్ల ఎత్తులో ఆరుసార్లు పరిభ్రమించనుంది. ఈ ప్రయాణ క్రమంలో ఇది భారతదేశం మీదుగా కూడా వెళుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 10 గంటల పాటు సాగే ఈ యాత్ర ముగింపులో, స్టార్‌షిప్ చిలీకి పశ్చిమ దిశలో పసిఫిక్ మహాసముద్రంలో సురక్షితంగా ల్యాండ్ (స్ప్లాష్‌డౌన్) అవుతుంది. ఇప్పటివరకు జరిగిన ప్రయోగాలన్నీ సబ్–ఆర్బిటల్ స్థాయిలోనే సాగగా, పూర్తిస్థాయి కక్షలోకి (ఆర్బిటల్) పంపిస్తున్న తొలి ప్రయోగం ఇదే కావడం విశేషం.

# యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..

**ఢిల్లీ సెప్టెంబరు 28,(ప్రజావినికిడి):**

ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది.

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల




నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.

వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.

అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

**ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు.

ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది

# సీఐ అలీ మృతిలో కొత్త కోణం..

**మొదటిపేజీ తరువాయి**

కానిస్టేబుల్ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

**తోపులాట వల్లే మరణం?**

విజయవాడలో సచివాలయ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో బందోబస్తు విధుల్లో ఉన్న సీఐ అలీని ఆందోళనకారులు నెట్టేశారని, ఈ తోపులాటలో ఆయన కిందపడిపోయారని కానిస్టేబుల్ సుధాకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కిందపడిన తర్వాత ఆయనకు తీవ్రమైన శ్వాస ఇబ్బందులు తలెత్తాయని, ఆ తర్వాతే గుండెపోటుకు గురయ్యారని తెలిపారు. ఈ ఫిర్యాదుతో సీఐ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటన జరిగిన తీరుపై విచారణ ప్రారంభించారు.

**అంతకుముందు ఏం జరిగిందంటే..**

ఆదివారం స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసనల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచే సీఐ అలీ విధుల్లో ఉన్నారు. ధర్నాచౌక్/అలంకార్ సెంటర్ వద్ద విధుల్లో ఉండగా, ఆయనకు స్వల్పంగా ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే సూర్యారావుపేటలోని ఓ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకున్నారు. అక్కడ కాస్త ఉపశమనం లభించడంతో తిరిగి విధుల్లో చేరారు.

అలంకార్ సెంటర్ వద్ద సుమారు 10 నిమిషాల పాటు నిలబడిన తర్వాత ఆయన మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సిబ్బంది ఆయన్ను జీపులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే స్పృహ కోల్పోయారు. ఆయన్ను ఆంధ్ర హార్ట్ అండ్ బ్రెయిన్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ప్రస్తుతం కానిస్టేబుల్ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఈ కేసును కొత్త కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులు, తోపులాట వాస్తవాలు, సీసీటీవీ ఫుటేజీ వంటి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

# ప్రమాదకర పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్రం నిషేధం

**ఢిల్లీ సెప్టెంబరు 28 ,(ప్రజావినికిడి):**

ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన కలుపు సంహారకాల్లో (హెర్బిసైడ్) ఒకటైన పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మానవులు, మూగజీవాల ఆరోగ్యానికి ఇది తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ నిర్ధారించడంతో ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో పారాక్వాట్‌ను నియంత్రించిన సుమారు 70 దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయింది.ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్, 1968 నిబంధనల ప్రకారం, నిపుణుల కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీల సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా ఆదేశాల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను కూడా రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. సదరు సర్టిఫికెట్లను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిషేధాజ్ఞలను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసింది.

ఎందుకీ నిషేధం?

పారాక్వాట్ డైక్లోరైడ్ అత్యంత విషపూరితమైన రసాయనం. దీనిని స్వల్ప మోతాదులో తీసుకున్నా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. దీనికి నిర్దిష్టమైన విరుగుడు లేకపోవడం వైద్య రంగంలో పెను ఆందోళన కలిగించే అంశం. ఈ రసాయనం ప్రధానంగా ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపి, 'పల్మనరీ ఫైబ్రోసిస్' వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది.

ఈ కలుపు సంహారకంపై నిషేధం విధించాలని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, పర్యావరణవేత్తలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, దేశంలో 2024లో పురుగుల మందుల కారణంగా సుమారు 34,000 మంది మరణించారు (వీటిలో ఆత్మహత్యలు, ప్రమాదవశాత్తు జరిగిన మరణాలు ఉన్నాయి). ఈ తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# తులం బంగారం ఇస్తామన్న వాళ్ల ఫొటోలు పోలీస్ స్టేషన్లలో పెట్టాలి!

**మొదటిపేజీ తరువాయి**

బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోనున్న బహదూర్‌పల్లికి చెందిన రైతులతో సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ పట్టాలిస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీలివ్వలేదా? ఆ మాట చెప్పిన వ్యక్తి మోసం చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫొటో పెట్టాలా? లేక రైతుల ఫొటోలు పెట్టాలా?' అంటూ పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రైతుల ఇళ్ల మీదకు ఏదో పక్క దేశం మీద దండయాత్రకు పోయినట్టు 4 వేల మంది పోలీసోళ్లను పంపారని విమర్శించారు. రైతుల భూముల విషయంలో ప్రభుత్వం వద్ద ఉన్న ఆధారాలను బహిరంగంగా చూపించాలని డిమాండ్ చేశారు. తాము బుల్లెట్ ట్రెయిన్‌కు వ్యతిరేకం కాదని, రియల్ ఎస్టేట్ దందాను మాత్రం ఒప్పుకోమని చెప్పారు. ఏడాది తర్వాత కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని, బహదూర్‌పల్లిలోనే మీటింగ్ పెట్టి రైతులకు పట్టాలు అందిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. మరోవైపు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నేతలతో జిల్లాల వారీగా కేటీఆర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీగ్రాఫ్ వేగంగా పడిపోతోందని, యువత దూరమైందనే ఆందోళన ఆ పార్టీ అగ్రనేతలను కలవరపరుస్తోందని, రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత తారస్థాయికి చేరిందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముదిరాజ్ సంక్షేమ సంఘం నేతలు సోమవారం కేటీఆర్‌ను కలిశారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్ల పర్యటనలో ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

- గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ
- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం
- ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన దానం నాగేందర్

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ,(ప్రజావినికిడి):**

తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానాన్ని ఖాళీగా గుర్తిస్తూ తెలంగాణ శాసనసభ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పును అనుసరించి, 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే ఆయన సభ్యత్వం రద్దయినట్లు ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఆ పిటిషన్లను స్పీకర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 18న కీలక తీర్పు వెలువరించింది. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన సమయం నుంచే ఆయనపై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన శాసనసభ్యత్వం రద్దు అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం ఆయన మాజీ ఎమ్మెల్యే అయ్యారు. మరోవైపు, త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తానే మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## రవీంద్రభారతిలో కోలాహలంగా వాగ్దేవి నృత్యక్షేత్ర నర్తన నాగార్జున '26' వార్షికోత్సవం



**ఆబిడ్స్, (ప్రజావినికిడి):** హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక వేదిక రవీంద్రభారతిలో 'వాగ్దేవి నృత్యక్షేత్ర' సంస్థ ఆధ్వర్యంలో "నర్తన '26" పేరిట 3వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురు ఎ. ఆశ్రిత పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ మంత్రి జి. వివేకానంద్



హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు, దూరదర్శన్ 'ఎ' గ్రేడ్ ఆర్టిస్ట్ గురు డాక్టర్ వినీల రావు, భరతనాట్యంలో 'బాలశ్రీ' అవార్డు గ్రహీత, ఢీ సెలబ్రిటీ స్పెషల్ విన్నర్ వర్షిణి అర్జ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాగ్దేవి నృత్యక్షేత్ర విద్యార్థులు సమర్పించిన వివిధ సాంప్రదాయ నృత్య రూపకాలు, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల అభినయం, నాట్య విన్యాసాలు రవీంద్రభారతి ప్రాంగణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కళాభిమానులు, తల్లిదండ్రులు హాజరై ప్రదర్శనలను తిలకించారు.

## 28 నాన్ డ్యూటీ లిక్కర్ పట్టివేత..



**నాంపల్లి, (ప్రజావినికిడి):** గ్రేటర్ హైదరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ టీం రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్ సమీపములో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను తెలంగాణకు తీసుకు వస్తున్న సందర్భంగా 28 మద్యం బాటిల్లను పట్టుకున్నారు. మద్యం బాటిల్లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు హైదరాబాద్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ డి శ్రీనివాస్ తెలిపారు.

## సర్దార్ భగత్ సింగ్ చిరస్మరణీయమైన భావాలు స్ఫూర్తినిచ్చేవి

### ఏ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్లేకంటి శ్రీకాంత్

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** కుల, మత, వర్గ భేదాలు లేని, మానవుని చేత మానవుడు దోపిడీకి గురికావని ఒక సమసమాజాన్ని నిర్మించాలనే సర్దార్ భగత్ సింగ్ చిరస్మరణీయమైన భావాలు స్ఫూర్తినిచ్చేవని ఏ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్లేకంటి శ్రీకాంత్ తెలిపారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద స్వతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య నేతలు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్లేకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ మతం వ్యక్తిగత విషయమని,




సమాజంలో అందరూ సమానమేనని సర్దార్ భగత్ సింగ్ ఆశయం అని, ఇందుకు బిన్నంగా నేడు బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలు రగుల్చి సామరస్యాన్ని దెబ్బతీస్తుందని ఆరోపించారు. నేడు నిరంకుశ మోదీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం పెను ప్రమాదంలో పడ్డాయని సర్దార్ భగత్ సింగ్ స్ఫూర్తితో మిలిటెంట్ ఉద్యమాలు నిర్మించి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించుకోవాలని నిర్లేకంటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.వై.ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ బాలకృష్ణ, షేక్ మహమూద్, నాయకులు కే కళ్యాణ్, మామిడి చెట్ల భగత్ సింగ్, ఎం కృష్ణ, మోహిత్ కుమార్, జగన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును కలుపుకొని బేస్మెంట్ నిర్మాణం..

### గతంలో ఆగిన పనులు.. ఇప్పుడు తిరిగి ప్రారంభం..

### వాటాలు పంచుకుంటున్న అధికారులు..స్థానిక నాయకులు..

**కుత్బుల్లాపూర్; (ప్రజావినికిడి):** గాజులరామారం పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీ ఫేస్-2లో స్థానికులు కొందరు రోడ్డును కలుపుకొని బేస్ మెంట్ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. గతంలో ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదులు చేయడంతో ఆగిన పనులు ఇప్పుడు తిరిగి ప్రారంభించారు. ఏకంగా 24 అడుగుల రోడ్డును కబ్జా చేయడం చూస్తే అక్రమార్కులతో అధికారులు కుమ్మక్కు కావటం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు స్థానికులు ఆరోపించినప్పటికి కూడా కబ్జా దారులు ఖాళీ



స్థలం తో పాటు రోడ్డును కలుపుకొని నిర్మాణాలు చేయుడం చక చక జరిగిపోతుంది. పట్టపగలే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా భవిష్యత్తు అవసరాలకు అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

# మహిళలకు సమాన హక్కు దక్కవలసిందే

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** మహిళలపై పెరుగుతున్న నేరాలను అరికట్టడంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ప్రస్తుతం దేశంలో మహిళలు తీవ్ర సవాళ్లను ఎదుర్కుంటున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదించిన తరువాత అమలు చేయకుండా బుట్ట దాఖలు చేసి మహిమలకు రాజకీయ సాధికారత దక్కకుండా మోదీ ప్రభుత్వం చేసిందని దుయ్యబట్టారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, మఖ్దోం భవన్ లో సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ) రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన



అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును, వివాదాస్పదమైన 'నియోజకవర్గాల పునర్విభజన' ప్రక్రియతో కేంద్ర ప్రభుత్వం ముడిపెట్టడంపై "ప్రజాస్వామ్యంపై దాడి" అని అన్నారు. అసలు మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన' ప్రక్రియతో ఏమి సంబంధం అని అయన ప్రశ్నించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశ మహిళలతోపాటు రైతు, యువజన, విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా మోసం చేస్తుందని చెప్పారు. దేశంలో సగభాగంగా ఉన్న మహిళలకు సమానమైన చట్టపరమైన, సామాజిక అలాగే రాజకీయ హక్కులను సాధించడానికి రాజీలేని పోరాటాలను సంసిద్ధం కావాలని కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు డా.కె.రజిని, సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, ఏం.నళిని, సహాయకార్యదర్శులు ఫైమీద బేగం, ఏ. లతాదేవి, కోశాధికారి జె. లక్ష్మి, నేతలు పడాల నళిని, కె. జ్యోతి, మాదవి, ఉజ్జిని హైమావతి, రొయ్యల గిరిజ కృష్ణమూర్తి, నీలమ్మ, సుగుణ మ్మ సుగుణ, అమినా, దీన, పద్మావతి, కోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కటౌట్ ప్రదర్శిస్తూ బిఆర్ఎస్ పార్టీ నేత నిరసన..

### ఈడి సోదాల వివరాలను వెల్లడించాలనీ డిమాండ్..

### చట్టం అందరికీ సమానంగా వర్తింపచేయాలి.. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కటౌట్‌ను ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈడీ కార్యాలయం బయట నిరసన చేపట్టారు. రెండు సంవత్సరాల క్రితం, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సంబంధం ఉన్న 16 ప్రదేశాలలో ఈడీ సోదాలు నిర్వహించింది, కానీ ఆ సోదాలకు సంబంధించిన వివరాలు లేదా వాటిలోని అంశాలను ఇంతవరకు విడుదల చేయలేదు.

నిరసన అనంతరం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, కె.పి. వివేకానంద్, ఎమ్మెల్సీలు శంభీపుర్ రాజు, నవీన్, బీఆర్ఎస్ నాయకుడు తలసాని సాయి కిరణ్ యాదవ్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఈడీ అధికారులను కలిసింది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్దిరాములు సంపత్ మాధవరెడ్డి వారాల వినోద్ కుమార్ సత్తిరెడ్డి శ్రీనివాస్ నదీమ్ రాయ్ పాల్గొన్నారు. ఈ నిరసన



కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కుంట సిద్దిరాములు మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ సంబంధాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు యూత్ నాయకులతో కలిసి ఈడీ కార్యాలయం బయట తమ నిరసనను కొనసాగించారు.

కేసుల దర్యాప్తు పురోగతిపై సంబంధిత సంస్థలు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. 2024 సెప్టెంబర్ 27 28 తేదీల్లో సోదాలకు సంబంధించిన ఈసీఐఆర్ కేసు వివరాలు ఏమిటి..? సోదరులు ఎంత నగదు ఎలాంటి పత్రాలు డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు..? స్వాధీనం చేసుకున్న వస్తువులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? సంబంధిత వ్యక్తులకు నోటీసులు లేదా సమన్లు జారీ చేశారా..? దర్యాప్తు అనంతరం ప్రాసిక్యూషన్ కంప్లైంట్ దాఖలు చేశారా..? సీజ్ చేసిన ఆస్తులు వాటి వివరాలు తదితర అంశాలపై ప్రస్తుత పరిస్థితి ఏమిటి..? ఈ వివరాలను 15 రోజుల్లోగా వెల్లడించాలని ఈడిని కోరినట్లు తెలిపారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని సంబంధిత అధికారులు దర్యాప్తు వివరాలను వాటి పురోగతి తదుపరి చర్యలపై వివరణ ఇవ్వాలని. చట్టం అందరికీ సమానంగా వర్తించాలన్నదే తమ అభిప్రాయం అని ఆయన అన్నారు.

# ఈడీ సోదాల వివరాలు వెల్లడించాలి

### : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల డిమాండ్..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాస, కార్యాలయాలతో పాటు సంబంధిత ప్రాంతాల్లో 2024 సెప్టెంబర్ 27,28 తేదీల్లో ఈడీ నిర్వహించిన సోదాలు, అనంతరం కొనసాగిన దర్యాప్తు వివరాలను వెల్లడించాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారంబషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, నవీన్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్ గౌడ్, సంజయ్, పార్టీ సీనియర్ నాయకులు తలసాని సాయి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈడీ కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఈడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయగా, అనంతరం అధికారులను కలిసి లేఖ అందించేందుకు పోలీసులు అనుమతించారుఈడి డిప్యూటీ డైరెక్టర్ స్వాతి ని కలిసి లేఖను అందించారు.

రెండేళ్లుగా దర్యాప్తు ఏ దశలో ఉంది..?2024 సెప్టెంబర్ 27,28 తేదీల్లో జరిగిన ఈడీ సోదాలకు రెండేళ్లు




పూర్తవుతున్న నేపథ్యంలో, ఇప్పటివరకు దర్యాప్తు ఏ దశలో ఉందో స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ తన లేఖలో కోరింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదు, పత్రాలు, డిజిటల్ పరికరాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వెంటనే వెల్లడించాలని కోరింది. ఈడీ సోదాలు సుమారు 16 ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగాయని, పెద్ద సంఖ్యలో అధికారులు, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారని లేఖలో పేర్కొన్నారు. సోదాల సందర్భంగా నగదు లెక్కింపు యంత్రాలను కూడా తీసుకెళ్లినట్లు బీఆర్ఎస్ పేర్కొంది. అయితే సోదాల అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులు, తదుపరి దర్యాప్తు చర్యలపై స్పష్టమైన సమాచారం వెల్లడించలేదని ప్రశ్నించింది. పలు కేసుల దర్యాప్తు పురోగతిపై ప్రశ్నలు....?నరసాపూర్ కోదండల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, వాటింగపల్లి ఎఫ్ఐఆర్, కొత్వాల్‌గూడ-మనసా హిల్స్‌కు సంబంధించిన అంశాలను కూడా లేఖలో ప్రస్తావిస్తూ, ఆయా వ్యవహారాల్లో దర్యాప్తు పురోగతి ఏమిటో వెల్లడించాలని బీఆర్ఎస్ కోరింది. ఈడీకి బీఆర్ఎస్ అడిగిన ప్రధాన ప్రశ్నలు..2024 సెప్టెంబర్ 27,28 తేదీల సోదాలకు సంబంధించిన ఈసిఐఆర్/కేసు వివరాలు ఏమిటి?

సోదాల్లో ఎంత నగదు, ఎలాంటి పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు? స్వాధీనం చేసుకున్న వస్తువులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి?

సంబంధిత వ్యక్తులకు నోటీసులు లేదా సమన్లు జారీ చేశారా? దర్యాప్తు అనంతరం ప్రాసిక్యూషన్ కంప్లైంట్ దాఖలు చేశారా? సీజ్ చేసిన ఆస్తులు, వాచ్‌లు తదితరాల ప్రస్తుత స్థితి ఏమిటి? దర్యాప్తు ప్రస్తుత స్థితి ఏమిటి? తదుపరి చర్యలు ఏమిటి? ఈ వివరాలను 15 రోజుల్లోగా వెల్లడించాలని బీఆర్ఎస్ ఈడీని కోరింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లయితే, తరువాతి తదుపరి చర్యలకు సంబంధించిన కాలపరిమితిపై కూడా స్పష్టత ఇవ్వాలని లేఖలో కోరింది. చట్టం ఎవరికి చుట్టం కాదని..చట్టం అందరికీ సమానంగా వర్తించాలన్నదే తమ అభిప్రాయమని, ప్రజలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతిపై సంబంధిత సంస్థలు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### ఈసీఐ నిర్ణయాలపై సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య తీవ్ర విమర్శలు

**శంషాబాద్, (ప్రజావినికిడి):** సెప్టెంబర్ 28: ఎన్నికల సంఘంలో ఏకపక్ష నిర్ణయాలు జరుగుతున్నాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం శంషాబాద్ మండల కేంద్రంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జంగయ్య మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించే చర్యలు జరుగుతున్నాయని, ఇవి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే పార్లమెంట్‌లో దీనిపై చర్చించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసేందుకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని జంగయ్య ఆరోపించారు. ప్రతిపక్ష




నాయకుల ఎన్నికల దరఖాస్తులను తిరస్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురిచేసి బీజేపీలో చేర్చుకునేందుకు ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయలేకపోతున్న ప్రభుత్వం ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు మతాన్ని రాజకీయాల్లో ఉపయోగిస్తోందని జంగయ్య ఆరోపించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన అధికారులు ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు సీపీఐ




ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని జంగయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు తదితరులు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి, ముత్యాల యాదిరెడ్డి, టి. రామకృష్ణ, కామెడి శేఖర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, పల్నాటి యాదయ్య, ఆరు యాదగిరి, నీలమ్మ, పి. శివకుమార్, ఎం.ఏ.రియాజ్, దత్తు నాయక్, కే. చందు యాదవ్, మల్లేష్, పాలమాకుల శ్రీశైలం, కే. శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, విజయ్ ఆనంద్ గౌడ్, గిలక రాజు, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# అనుమతులు లేని పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి..

## విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి.. అకుల సతీష్

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పాండు బస్తీలో నిర్వహిస్తున్న ఏవి మోడల్ స్కూల్ కు సంబంధించిన అనుమతులు, గుర్తింపు, పాఠశాల నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేసినట్లు అకుల సతీష్ తెలిపారు. ఫిర్యాదుపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, అలాగే మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారికి (డిఈఓ) ఫిర్యాదును పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పాఠశాలకు చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ అనుమతి, గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలితే పాఠశాలను సీజ్ చేసి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు అకుల సతీష్ పేర్కొన్నారు.

అనుమతుల విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడకూడదని, అవసరమైతే వారిని సమీపంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించి వారి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా విద్యార్థులకు టిసిలు,విద్యా రికార్డులు,బోర్డు రిజిస్ట్రేషన్, ఎస్ఎస్ సి/10వ తరగతి పరీక్షల నమోదు విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా ఉపాధ్యాయురాలి అంశంపై కూడా విచారణ చేయాలి పాఠశాలలో పనిచేస్తున్న మహిళా



ఉపాధ్యాయురాలితో అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు, ఆమె బంధువులపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు.

మహిళా ఉపాధ్యాయురాలి విషయంలో వచ్చిన ఆరోపణలను తాము అంగీకరించబోమని,ఈ అంశంపై డైరెక్టర్,స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి మరోసారి ఫిర్యాదు చేయడంతో పాటు తెలంగాణ మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయించి చర్యలు కోరుతామని అకుల సతీష్ తెలిపారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలిపిల్లలను పాఠశాలలో చేర్పించే ముందు తల్లిదండ్రులు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు, చెల్లుబాటు అయ్యే అనుమతులు, పాఠశాలకు సంబంధిత విద్యాశాఖ రిజిస్ట్రేషన్ ఉన్నాయా లేదా తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని సూచించారు.

పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో కేవలం యాజమాన్యం ఇచ్చే హామీలపై ఆధారపడకుండా,సంబంధిత విద్యాశాఖ అధికారుల


Officer Copy

GOVERNMENT OF TELANGANA

Medchal Malkajigiri District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DMDCL28092600056 | Grievance Date: | 28-SEP-2026 |
| Citizen Name: | A Sathish | Mobile No.: | 9912345194 |
| Gist of Grievance: | Requesting to action on Unauthorized operation of AV Model School | | |

Your Grievance has been forwarded to the **DEO Office - Medchal - Medchal Malkajigiri** for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required

*"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."*

... and enrolling for the Class X/SSC examinations in the future.

There are also allegations regarding inappropriate behaviour towards a woman teacher working at the school. It is further alleged that when her relatives questioned the Principal regarding the matter, they were attacked with knives. It is understood that a case has been registered by Suraram Police Station in connection with the incident. The said matter may also kindly be examined in coordination with the Police Department.

Therefore, we request the following immediate actions:

1. The District Education Department may immediately conduct an inspection and verify whether "AV Model School" has valid and current permission/recognition from the School Education Department.
2. If the school is found to be operating without valid permission, its operations may be immediately stopped/sealed in accordance with law, and appropriate legal action may be initiated against the persons responsible.
3. If it is established during the inquiry that the school has been operating without the required permissions, appropriate criminal/legal proceedings may be initiated against the persons responsible, including Mr. Daniel Raju, as per the applicable law.
4. Immediate steps may be taken to ensure that the students presently studying in the school do not suffer academically. If necessary, they may be shifted/admitted to nearby schools having valid recognition and permissions, so that their education and future are not affected.
5. The Education Department may ensure that the students do not face any difficulty in obtaining TCs, board registration, SSC/Class X examination enrollment and other academic records.
6. The authorities may thoroughly verify the school's permission/recognition status, ownership/management rights, transfer of permissions, admissions and all records relating to the operation of the school during the past two years.
7. The allegations regarding inappropriate conduct towards the woman teacher and the alleged attack on her relatives may be investigated impartially in coordination with the concerned Police authorities, and appropriate legal action may be taken against those found responsible.
8. The authorities may also examine why no timely action was taken by the concerned Education Department officials, if the school has in fact been functioning without the required permissions.

ద్వారా పాఠశాల గుర్తింపు వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే అడ్మిషన్ తీసుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ వ్యవహారంలో అధికారులు జాప్యం చేయకుండా సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, పాఠశాలల నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్,కంది శ్రీరాములు,జి. శ్రీనివాస్,అంగడి మల్లేష్, యాదగిరి యాదవ్, వనమాల, నాగరాజ్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖకు వెపన్స్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు

## ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ సమీక్ష



**నాంపల్లి, (ప్రజావినికిడి):** ఎక్సైజ్‌శాఖకు వెపన్స్ కోసం ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించడానికి సమగ్ర సమాచారాన్ని తీసుకోవడానికి క్యూర్ పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇవ్వడానికి అనుమతి ఇస్తే ఏ స్థాయి అధికారులకు వెపన్లు ఇవ్వాలని అనే విషయంపై ఎక్సైజ్ శాఖ అధికారుల అభిప్రాయాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్‌శాఖకు ప్రభుత్వం వెపన్లు ఇస్తే పోలీస్ శాఖతో కోర్డినేషన్ చేసుకుంటు వెళ్లాల్సి ఉంటుందని కమిషనర్ అదేశించారు. ఎక్సైజ్‌శాఖ ఎన్‌డీపీఎస్ (డ్రగ్స్), ఎన్‌డీపీఎస్ (నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్)పైపూర్తి స్థాయిలో నిఘా పెట్టి, అరికట్టడడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ అదేశించారు. బార్స్, మద్యం షాపులకు సంబంధించిన ఎక్సైజ్ రెంటల్ ఫీజ్‌ను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. కొత్త బార్ల కోసం దరఖాస్తులు చేసుకునే వారికి అవసరమైన సౌకర్యాల కల్పన చేపట్టాలని, దరఖాస్తుదారులకు ఎక్సైజ్ అధికారులు తగిన గైడెన్స్ ఇవ్వాలని కమిషనర్ అదేశించారు. సమావేశంలో అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషి, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ జి. అంజన్‌రావు, గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ డిప్యూటి కమిషనర్లు ఏ. శ్రీనివాసరెడ్డి,జె. హరికిషన్, టీజీబీసీఎల్ డిప్యూటి కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ హెడ్ క్వార్టర్స్ శీలం శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్లు డి.శ్రీనివాస్, జి.శ్రీనివాసరెడ్డి, కె.ప్రదీప్‌రావు తోపాటు ఈఎస్‌లు ఉన్నారు.

# భగత్ సింగ్ ఆశయ బాటలో నేటి యువత పయనించాలి




**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ ఘనంగ 119వ జయంతి సందర్భంగా హిమాయత్ నగర్ నుండి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,భరతమాత దాస్య శృంఖలాలను బద్దలు కొట్టడానికి, బ్రిటిష్ వాళ్ళను ఈ దేశం నుండి తరిమి కొట్టడానికి,నూనూగు మీసాల చిన్న వయసులోనే రాజ్ గురు,సుఖ్ దేవ్ లతో కలిసి బ్రిటిష్ పార్లమెంటు పైన బాంబుల వర్షం కురిపించి చిరునవ్వులు చిందిస్తూ ఉరికొయ్యలను ముద్దాడుతూ ఇంక్విలాబ్ నినాదాన్ని దేశ యువతకు ప్రజలకు అందించి యువతను విప్లవ బాటలో పయనించాలని, బానిసత్వాన్ని ఎదిరించాలని,బ్రిటిష్ వాళ్ళను ఈ దేశం నుండి పారద్రోలే వరకు విశ్రమించొద్దని నినదించిన,ప్రబోధించిన వీర కిశోరం,విప్లవ సింహం, యువతరానికి స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్ అని, ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయిన ఆయన మరణం ఈ దేశంలో విప్లవానికి శంఖారావాన్ని పూరించిందని, యువతరాన్ని మేల్కొలిపిందని, చైతన్యాన్ని రగిలించిందని, అన్ని వర్గాల ప్రజలను కదిలించిందని, ఎంతోమంది వీరులను, విప్లవకారులను ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములను చేసిందని,ఆనాటి అమరుల త్యాగ ఫలితమే ఈనాటి స్వాతంత్ర్యమని,కాని ఆ అమరుల కలలు ఈనాటి వరకు నెరవేరలేదని,అధికార మార్పు మాత్రమే జరిగిందని,తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారని,ప్రజల బ్రతుకుల్లో అనువంతైన మార్పు రాలేదని, పేదరికం,దోపిడి పోలేదని, విద్య,వైద్యం ఉద్యోగం, దున్నేవానికి భూమి, గిట్టుబాటు ధరలు, ఆడపిల్లల జీవితాలకు భద్రత ఇంకెన్నో మరెన్నో సమస్యలు తీరే దారి కనుచూపు మేరలో కానరావడంలేదని,కేంద్ర, అమరజీవి భగత్ సింగ్ అందించిన స్ఫూర్తితో యువత నడుము కట్టాలని, పిడికిలెత్తాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమన్,నాగేందర్, రజనీకాంత్ జిల్లా సహాయ కార్యదర్శులు ఆంజనేయులు, ప్రవీణ్ జిల్లా నాయకులు భరత్,కార్తీక్, అశ్వక్,సాయి, ప్రవీణ్,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ ఎత్తివేస్తే ప్రభుత్వ భూములు మాయం..

**నిషేధిత జాబితా తొలగింపుతో భూకబ్జాదారులకు రెక్కలు..**

**భవిష్యత్ తరాలకు ప్రభుత్వ ఆస్తులు అసలు దక్కవు..**

**రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే ప్రభుత్వ భూములకు రక్షణ కరువే..**

**22-ఏ ఉండగానే భూములను మింగేస్తున్నారు.. తొలగిస్తే ఒక్క అంగుళం కూడా మిగలనివ్వరు..**

**టీజేఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటీ రామకృష్ణ..**






**హైదరాబాద్, (ప్రజావినికిడి):** ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించేందుకు అమలులో ఉన్న నిషేధిత జాబితా 22-ఏ ను ఎత్తివేయడం వల్ల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టీజేఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటీ రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములకు రక్షణగా ఉన్న వ్యవస్థను బలహీనపరిస్తే భూకబ్జాదారులకు మరింత అవకాశం కల్పించినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములపై కన్నేసిన కొందరు వ్యక్తులు మొదట ఆక్రమణలకు పాల్పడి, అనంతరం వాటిని 100 గజాలలోపు ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో విక్రయిస్తున్నారనే ఆరోపణలు అనేక ప్రాంతాల్లో వినిపిస్తున్నాయని గౌటీ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులు,సర్వే నంబర్లు, హక్కులు, వర్గీకరణ వంటి అంశాలను పూర్తిగా పరిశీలించకుండానే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తే భవిష్యత్‌లో వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

### 22-ఏ ఉండగానే కబ్జాలు

22-ఏ జాబితా అమల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వ భూములపై ఆక్రమణలు, ప్లాట్లుగా విభజించడం, యదేచ్ఛగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో ముఖ్యమైన 22-ఏ రక్షణను తొలగిస్తే ప్రభుత్వ భూములను గుర్తించడం, తిరిగి స్వాధీనం చేసుకోవడం ఎవరి తరం కాకుండా పోతుందన్నారు. 22-ఏ ఉండగానే ప్రభుత్వ భూములను మింగేస్తున్న కబ్జాదారులు అదే రక్షణను తొలగిస్తే ఒక్క అంగుళం భూమిని కూడా మిగలనివ్వరు అని గౌటీ రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

### కబ్జాలకు కళ్లెం ఎవరు.?

ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని,వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. భూముల రికార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దేందుకు ప్రత్యేక పరిశీలన చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అలాగే 22-ఏ నుంచి భూములను తొలగించే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్,సర్వే విభాగాల రికార్డులను సమగ్రంగా సరిపోల్చాలని తెలిపారు.

అదేవిధంగా ప్రభుత్వ భూములపై ఇప్పటికే జరిగిన ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, అనుమానాస్పద లావాదేవీలపై కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక విచారణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారాలను కూడా అధికారులు బహిర్గతం చేసి వాటిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటో తెలపాలని ఆయన కోరారు.

### రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

రాజకీయ నేతల ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గి 22-ఏను ఎత్తివేస్తే అది కేవలం ప్రభుత్వ భూముల సమస్యను అసలు తీర్చదని దానివల్ల ప్రభుత్వ భూమి ఎక్కడ మిగలదని భవిష్యత్ తరాలకు చెందాల్సిన ప్రజా ఆస్తి క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుందని గౌటీ రామకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో ఎలాంటి మినహాయింపులు, సడలింపులు ఇచ్చినా పూర్తి పారదర్శకత పాటించాలని, భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. 22-ఏ తొలగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ముందు ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

### ప్రజా ఆస్తుల పరిరక్షణే బాధ్యత

ప్రభుత్వ భూమి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని,అది ప్రజల ఆస్తి అని గౌటీ రామకృష్ణ స్పష్టం చేశారు. రేపటి తరాలకు చెందాల్సిన భూములను ఈరోజే కబ్జాలు, అక్రమ లావాదేవీలకు గురిచేసే పరిస్థితులు రాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. 22-ఏ రక్షణను తొలగించే ఏ నిర్ణయమైనా ప్రజా ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తుల భద్రత,భవిష్యత్ తరాల హక్కులను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఉండాలని గౌటీ రామకృష్ణ స్పష్టం చేశారు.

# శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..వ్యక్తి మృతి






**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 28,** శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగి అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో రాయల్ విల్లాస్ లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ చౌదరి తన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ పై రాళ్లగూడ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా చంద్రశేఖర్ చౌదరి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ ముక్కు నుదుటి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతను సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వెంటనే స్థానికులు 112 కు ఫోన్ చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఆర్జీఐఏ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య సిగపల్లి కుమారి తన భర్త బైక్ అదుపుతప్పి పడిపోయాడా? లేక ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా? వృత్తికి ఇంకా ఏదైనా ఇతర కారణం ఉందా? అనే కోణంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ శంషాబాద్ ఆర్ జి ఐ ఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# ఆసియాడ్ స్వర్ణ విజేత భారత మహిళల కబడ్డీ జట్టు కోచ్‌కు ఘన స్వాగతం





**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 28,** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారత మహిళల కబడ్డీ జట్టు కోచ్ నీత దద్వేకు ఘన స్వాగతం లభించింది. జపాన్‌లో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో భారత మహిళల కబడ్డీ జట్టును స్వర్ణ పతకం దిశగా నడిపించిన నీత దద్వే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు ఆమెకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. జట్టు విజయానికి నీత దద్వే అందించిన వ్యూహాత్మక శిక్షణ, సమర్థవంతమైన మార్గదర్శకత్వం కీలకంగా నిలిచిందని అధికారులు కొనియాడారు. దేశానికి, తెలంగాణకు కీర్తి తీసుకొచ్చిన కోచ్‌ను అభినందించిన అధికారులు.. ఆమె శిక్షణలో మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్ రెడ్డి, సలహాదారులు జగదీష్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ కుమార్, వీఆర్వో కాలేరు సురేష్‌తో పాటు పలువురు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పేద్దాం..



**సౌకర్యం కోసం వాడుతున్నాం..**
**భవిష్యత్తుకు సమస్యను**
**మిగులుస్తున్నాం.**

**ప్రత్యామ్నాయాలను ఎంచుకుంటే**
**పర్యావరణానికి రక్షణ..**

**సామాజిక విశ్లేషకులు**
**కోహిర్ శ్రీనివాస్..**

**ఎల్బీనగర్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 28,**
మన రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగం అనివార్యంగా మారిపోయింది. కూరగాయలు, కిరాణా సరుకులు కొనడం నుంచి ఆహార పదార్థాల ప్యాకింగ్ వరకు ప్రతి దశలోనూ ప్లాస్టిక్ కనిపిస్తోంది. తక్కువ ధర, తేలిక,సౌకర్యం వంటి కారణాలతో ప్లాస్టిక్ వినియోగం విస్తరించింది. అయితే కొద్దిసేపు ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువు పర్యావరణంలో మాత్రం దీర్ఘకాలిక సమస్యగా మిగిలే అవకాశం ఉంది.
అందుకే ప్లాస్టిక్‌ను తగ్గించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు.. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత.

**సమస్య ఎక్కడ మొదలవుతోంది?**

ఒక్కసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ కవర్లు,కప్పులు, ప్లేట్లు,స్పూన్లు, స్ట్రాలు,సీసాలు, ప్యాకింగ్ పదార్థాలు పెద్ద మొత్తంలో వ్యర్థాలుగా మారుతున్నాయి. ఇవి సక్రమంగా సేకరించబడకపోతే రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో, చెత్తకుప్పల్లో పేరుకుపోతున్నాయి.
కాలువల్లోకి చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారవచ్చు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడం వంటి ఇబ్బందులకు ఇది ఒక కారణంగా మారే అవకాశం ఉంది.

**నేల..నీరు.. జీవజాలంపై ప్రభావం**

ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంలో సులభంగా కలిసిపోవు. కాలక్రమంలో చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి మైక్రోప్లాస్టిక్‌గా మారవచ్చు.ఇవి నేల,నీటి వనరుల్లోకి చేరే అవకాశం ఉంది.
చెత్తకుప్పల్లోని ప్లాస్టిక్‌ను పశువులు ఆహారంగా పొరబడే ప్రమాదం ఉంది. నీటి వనరుల్లోకి చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు జలచరాలకు కూడా హాని కలిగించవచ్చు.

**ప్లాస్టిక్‌ను కాల్చడం పరిష్కారం కాదు**

ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం సరైన పరిష్కారం కాదు. ప్లాస్టిక్ రకాన్ని బట్టి దహనం సమయంలో హానికరమైన పొగ, రసాయనాలు విడుదలయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్లాస్టిక్‌ను కాల్చకుండా, వేరు చేసి సరైన వ్యర్థ నిర్వహణ వ్యవస్థకు అందించడం అవసరం.

**మార్పు మన ఇంటి నుంచే**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి పెద్ద కార్యక్రమాలే అవసరం లేదు. మన రోజువారీ జీవితంలో చిన్న మార్పులు చాలు.




షాపింగ్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ సంచి తీసుకెళ్లడం, పునర్వినియోగించగలిగే నీటి సీసాను ఉపయోగించడంఅవసరం లేని ప్లాస్టిక్ ప్యాకింగ్‌ను తిరస్కరించడం, ఇంట్లో చెత్తను వేరు చేయడం వంటి చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టవచ్చు.

**పాఠశాలల నుంచే అవగాహన**

పిల్లల్లో చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలి. పాఠశాలల్లో ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కార్యక్రమాలు, పోస్టర్ పోటీలు, వ్యాసరచన, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించవచ్చుపిల్లలు మారితే కుటుంబాల్లోనూ మార్పు వస్తుంది. కుటుంబాలు మారితే సమాజంలో మార్పు మొదలవుతుంది.

**కాలనీ స్థాయిలో ఉద్యమంగా**

కాలనీ సంక్షేమ సంఘాలు ప్రజలతో కలిసి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాలు చేపట్టవచ్చు. వేడుకలు, సమావేశాల్లో ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా పునర్వినియోగ వస్తువులను ఉపయోగించవచ్చు.
ప్రతి కుటుంబం షాపింగ్‌కు వెళ్లేటప్పుడు ఒక గుడ్డ సంచిని వెంట తీసుకెళ్లడం అలవాటుగా చేసుకుంటే ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

**ప్రత్యేక బాక్స్ : ప్లాస్టిక్ వల్ల ఎదురయ్యే 10 సమస్యలు**

1.చెత్త పెరుగుదల:
ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు భారీగా వ్యర్థాలను పెంచుతాయి.
2.కాలువల్లో అడ్డంకులు:
ప్లాస్టిక్ కవర్లు, ప్యాకింగ్ పదార్థాలు కాలువల్లో పేరుకుపోతే నీటి ప్రవాహానికి ఆటంకం కలగవచ్చు.
3.నేల కాలుష్యం:
ప్లాస్టిక్ సులభంగా ప్రకృతిలో కలిసిపోకపోవడంతో నేలపై దీర్ఘకాలిక ప్రభావం ఉండవచ్చు.
4.నీటి కాలుష్యం:
ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులు, నదులు, సముద్రాల్లోకి చేరితే నీటి పర్యావరణానికి సమస్యలు ఏర్పడవచ్చు.
5.జంతువులకు ప్రమాదం:
పశువులు,ఇతర జంతువులు ప్లాస్టిక్‌ను ఆహారంగా పొరబడే అవకాశం ఉంది.
6.జలచరాలకు ముప్పు:
నీటిలోని ప్లాస్టిక్ వ్యర్థాలు జలచరాలకు హాని కలిగించవచ్చు.
7.మైక్రోప్లాస్టిక్ సమస్య:
పెద్ద ప్లాస్టిక్ ముక్కలు కాలక్రమంలో చిన్న కణాలుగా మారే అవకాశం ఉంది.
8.బహిరంగ దహనంతో వాయు కాలుష్యం:
కొన్ని రకాల ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల హానికరమైన పొగ, రసాయనాలు విడుదలయ్యే అవకాశం ఉంది.
9.వ్యర్థ నిర్వహణపై భారం:
పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, వేరు చేయడం, నిర్వహించడం మరింత కష్టతరం అవుతుంది.
10.భావితరాలకు పర్యావరణ సవాలు:
ప్రస్తుత ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోతే భవిష్యత్ తరాలపై పర్యావరణ భారం పెరిగే అవకాశం ఉంది.

**ప్రత్యేక బాక్స్ ప్లాస్టిక్‌కు బదులుగా ఏమి వాడాలి?**

ప్లాస్టిక్ వస్తువుసాధ్యమైన ప్రత్యామ్నాయం
ప్లాస్టిక్ కవర్లు
గుడ్డ / జూట్ సంచులు
ప్లాస్టిక్ వాటర్ బాటిల్
స్టీల్ / పునర్వినియోగ సీసా
డిస్పోజబుల్ ప్లేట్లు
స్టీల్ / పునర్వినియోగ ప్లేట్లు
ప్లాస్టిక్ కప్పులు
స్టీల్ / గాజు / పునర్వినియోగ కప్పులు
ప్లాస్టిక్ స్పూన్లు
స్టీల్ / పునర్వినియోగ స్పూన్లు
ప్లాస్టిక్ ఫుడ్ కంటైనర్లు
స్టీల్ / గాజు పాత్రలు
ప్లాస్టిక్ షాపింగ్ బ్యాగులు
గుడ్డ / జూట్ బ్యాగులు
ఒక్కసారి ఉపయోగించే వస్తువులు
పునర్వినియోగ వస్తువులు

మనం పాటించాల్సిన 5 సూత్రాలు
తగ్గిద్దాం, తిరస్కరిద్దాం, పునర్వినియోగిద్దాం, వేరు చేద్దాం, రీసైకిల్ చేద్దాం
అవసరం లేని ప్లాస్టిక్‌ను ముందుగా తగ్గించడం ముఖ్యం. సాధ్యమైన చోట సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తిరస్కరించాలి. ఉపయోగించగలిగే వస్తువులను పునర్వినియోగించాలి. ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను వేరు చేసి, పునర్వినియోగం లేదా రీసైక్లింగ్‌కు అనుకూలమైన వాటిని సరైన వ్యవస్థకు అందించాలి.

ముగింపు
ప్లాస్టిక్ సమస్యను ఒక్కరోజులో పరిష్కరించడం సాధ్యం కాకపోవచ్చు. కానీ ప్రతిరోజూ మనం తీసుకునే చిన్న నిర్ణయాలు పెద్ద మార్పుకు పునాది కావచ్చు.
ఒక్క కుటుంబం మారితే ఒక వీధి మారుతుంది..
ఒక్క వీధి మారితే ఒక కాలనీ మారుతుంది..
ఒక్క కాలనీ మారితే ఒక నగరం మారుతుంది..
సమాజం మొత్తం మారితే పర్యావరణానికి మేలు జరుగుతుంది.
మన చేతిలోని ఒక గుడ్డ సంచి.. మన ఇంటిలోని ఒక పునర్వినియోగ సీసా..మనం తిరస్కరించిన ఒక ప్లాస్టిక్ కవర్.. ఇవన్నీ చిన్న అడుగులే.కానీ ఆ చిన్న అడుగులే పెద్ద సామాజిక మార్పుకు నాంది కావచ్చు.
ప్లాస్టిక్‌కు గుడ్‌బై.. ప్రకృతికి స్వాగతం

# అక్టోబర్ 6న ఛలో ఉస్మానియా యూనివర్సిటీ

**ఎంఎస్పీ జాతీయ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలి..**

**రాగల్ల ఉపేందర్ మాదిగ..**

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఎంఎస్పీ జాతీయ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ విద్యార్థులను శాస్త్రీయంగా, సైద్ధాంతికంగా, నిర్మాణాత్మకంగా బలోపేతం చేసి విద్యార్థి ఉద్యమాన్ని మరింత శక్తివంతం చేయాలని ఆయన అన్నారు. హయత్‌నగర్ మండల కేంద్రంలోని సిటిజన్ కమ్యూనిటీ హాల్‌లో ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన సోమవారం ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా



పోరాటం సాగిందని,అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు.
ఎస్సీ వర్గీకరణ ద్వారా విద్యా, ఉద్యోగ రంగాల్లో లభించే అవకాశాలను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకునేలా మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మేధస్సు, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకొని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం విద్యార్థి ఉద్యమాలు బలహీనంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థి లోకానికి నాయకత్వం వహించేలా ఎంఎస్పీ ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సమస్యలు, అన్యాయాలపై బలమైన పోరాటాలు నిర్మించేందుకు డిగ్రీ,పీజీ, జూనియర్ కళాశాలల్లో ఎంఎస్పీ నూతన కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థి ఉద్యమాన్ని విస్తృతం చేయాలని కోరారు.కుల వివక్ష, పేదరికం, అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం బలమైన ప్రజా ఉద్యమాలను కొనసాగించాలని అన్నారు.అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరుస్తూ ఎంఆర్పీఎస్, ఎంఎస్పి తో పాటు అనుబంధ విభాగాల కమిటీలను పూర్తి చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ల బాబు మాదిగ, ఎంఆర్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ, ఎంఎస్పి
ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇంచార్జి ఎర్ర రవీందర్ మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ,శంకర్ రావు మాదిగ, రత్నం మాదిగ, చిట్టిబాబు మాదిగ,శామ్లెట్ గణేష్ మాదిగ, హేమంత్ గుప్త, కడిగళ్ల ప్రవీణ్ మాదిగ,బ్యాతల శివ మాదిగ, ఎంఆర్పీఎస్ నియోజకవర్గ కో-ఇంచార్జి సతీష్ మాదిగ, హయత్‌నగర్ అధ్యక్షులు శివ మాదిగతో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**70 గ్రాముల గంజాయి స్వాధీనం.. నిందితుడిని అరెస్ట్ చేసిన నాచారం పోలీసులు**

**నాచారం,(ప్రజావినికిడి):**
గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.
పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మల్లాపూర్ జనప్రియ లేన్ సమీపంలోని బాలాజీ ధాబా ఎదురుగా, ఎంఎస్ బిర్యానీ షాప్ వద్ద నాచారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా,అతని వద్ద 14 ప్యాకెట్లలో సుమారు 70 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.
పోలీసులు నిందితుడిని ముకేష్ చోహన్ (33)గా గుర్తించారు. దాదన్ నోనియా కుమారుడైన ముకేష్ చోహన్ కన్‌స్ట్రక్షన్ లేబరర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మల్లాపూర్‌లోని భవానీ నగర్, ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడని, స్వస్థలం బీహార్ రాష్ట్రంలోని కైమూర్ (భబువా) జిల్లా సోన్వాన్ గ్రామమని పోలీసులు పేర్కొన్నారు.



నిందితుడి వద్ద నుంచి 14 ప్యాకెట్లలో ఉన్న సుమారు 70 గ్రాముల గంజాయిని, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ ఘటనపై నాచారం పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు.నిందితుడిని అరెస్ట్ చేసి వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం,నిల్వ, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.
మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి యువత వాటికి దూరంగా ఉండాలని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలని నాచారం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నేతాజీ కాలనీలో ప్రభుత్వ స్థలంపై వివాదం..

**ప్రజా ప్రయోజనం కోసం వదిలేసిన స్థలాన్ని పరిరక్షించాలని కాలనీవాసుల విజ్ఞప్తి..**

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో గల నేతాజీ నగర్ కాలనీలో ప్రజా ప్రయోజనం కోసం రిజర్వ్ చేసినట్లు లేఅవుట్ రికార్డుల్లో పేర్కొన్న స్థలంపై వివాదం నెలకొంది.సర్వే నంబర్ 240/పి, ఎల్ పి నెంబర్.8/90 పరిధిలోని సుమారు 840 చదరపు గజాల స్థలం విషయంలో కొందరు వ్యక్తులు తమకు హక్కు ఉందంటూ కాలనీవాసులపై ఒత్తిడి,బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
స్థానికుల వివరాల ప్రకారం.. 1990లో రూపొందించిన నేతాజీ కాలనీ లేఅవుట్ మ్యాప్‌లో ప్రజా ప్రయోజనం కోసం కొంత స్థలాన్ని రిజర్వ్ చేసినట్లు నమోదై ఉందని వారు చెబుతున్నారు. ఈ స్థలాన్ని గతంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ/స్థానిక సంస్థ స్థలంగా గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.ప్రస్తుతం ఆ స్థలంపై హక్కుల విషయంలో వివాదం తలెత్తడంతో అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి స్పష్టత ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**శ్రమదానంతో అభివృద్ధి.. ప్రహరీ గోడల ఏర్పాటు**

స్థలంలో పెద్ద గుంతలు ఉండటంతో కాలనీవాసులు శ్రమదానంతో వాటిని సరిచేసి, తమ సొంతంగా ఫ్రీకాస్ట్ ప్రహరీ గోడలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం అక్కడ వినాయక చవితి, బతుకమ్మ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అయితే గతంలో కాలనీవాసులు ఏర్పాటు చేసిన ఫ్రీకాస్ట్ ప్రహరీ గోడలను కొందరు వ్యక్తులు కూల్చివేశారని వారు ఆరోపిస్తున్నారు.తమ అనుమతి లేకుండా ప్రహరీ గోడలను తొలగించిన ఘటనపై అధికారులు విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.




**లేఅవుట్ మ్యాప్ లో స్పష్టంగా చూపుతున్న ప్రభుత్వ స్థలం**

**బెదిరింపులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

ఇటీవల కొందరు వ్యక్తులు ఆ స్థలం తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇకపై అక్కడ వినాయక మండపం లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించవద్దని హెచ్చరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. దీంతో కాలనీవాసుల్లో ఆందోళన నెలకొంది.స్థల హక్కులు,ప్రహరీ గోడల తొలగింపు, బెదిరింపుల అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.
ఈ విషయంపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తామని కాలనీవాసులు పేర్కొన్నారు. సర్వే నంబర్ 240/పి కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, ఎల్ పి నెంబర్.8/90 లేఅవుట్,ప్రజా ప్రయోజన/ఓపెన్ స్పేస్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించి స్థల హద్దులను అధికారికంగా నిర్ధారించాలని కోరుతున్నారు. ప్రభుత్వ లేదా ప్రజా ప్రయోజనానికి కేటాయించిన స్థలమైతే దానిని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడలను కూల్చివేసిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం



**కబ్జాదారులు ధ్వంసం చేసిన ఫ్రీ కాస్ట్ వాల్**




చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.అదే సమయంలో ఎవరికైనా స్థలంపై చట్టబద్ధమైన హక్కులు ఉన్నట్లయితే సంబంధిత పత్రాలను పరిశీలించి అధికారులు తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. వివాదాస్పద స్థలంపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుని,వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాలని వారు విజ్ఞప్తి చేశారు.




# శంషాబాద్‌లో విషాద ఘటన..

**ప్రేమించిన వ్యక్తి మృతితో తీవ్ర మనస్తాపంతోయువతి మృతి**

**ఘటనాస్థలంలో చేతిరాత నోట్ లభ్యం**

**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 28:**
రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. సిద్ధేశ్వర్ కాలనీకి చెందిన 19 ఏళ్ల బూర నర్మద మృతి చెందింది. ఈ ఘటనపై ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం..నర్మద తన అక్క నివాసంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందింది. ఘటనాస్థలంలో ఆమె రాసినట్లు భావిస్తున్న చేతిరాత నోట్‌ను పోలీసులు గుర్తించారు.ప్రాథమిక దర్యాప్తులో భాగంగా..నర్మద సిద్ధార్థ్ బెజని గౌడ్ అనే యువకుడిని ప్రేమించినట్లు, సుమారు 15 రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో అతడు మృతి చెందడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ఫిర్యాదుదారుడి వాంగ్మూలం, ఘటనాస్థలంలో లభించిన నోట్‌లోని వివరాల ఆధారంగా పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. సంబంధిత సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



# పెనుగోలు గుట్టల పైనుండి దింపారు సమస్యలు వదిలేసారు

### ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షుడు మోడెం. నాగరాజు




**వాజేడు,(ప్రజావినికిడి):** ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు పెనుగోలు కాలనీ సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. పెనుగోలు కాలనీ గ్రామస్థులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇంటి పన్నులు, ఇంటి పట్టాలు,కరెంట్ మీటర్ల సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షుడు మోడెం. నాగరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎంపిడిఓ,కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని ఇంటి పన్నుల, ఇంటి పట్టాలు విధింపులో ఉన్న వ్యత్యాసాలు, కొత్త కరెంట్ మీటర్ల మంజూరు విషయంలో నెలకొన్న జాప్యంపై వాజేడు ఎంపీడీఓ ఆఫీస్‌లో పలుమార్లు అర్జీలు సమర్పించినా ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ఉద్దేశించిన 'ప్రజావాణి' కార్యక్రమం పెనుగోలు కాలనీ వాసుల పట్ల కేవలం కాగితాలకే పరిమితమైందని,అధికారుల చుట్టూ తిరగలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టల పై ఉన్న ఆదివాసీ కుటుంబాలను అన్ని సమస్యలకు పరిస్కారం చూపుతాము, అని పెనుగోలు, గుట్టల పైనుండి వాజేడులో కాలనీ ఏర్పాటు చేసి సరైన ఇంటి పన్నులు,ఇళ్ల పట్టాలు,కరెంటు మీటర్లు ఏది సక్రమంగా అందడం లేదు అని ఆవేదన వ్యక్తం చేసారు ఇప్పటికైనా సంబంధిత ధికారులు వెంటనే స్పందించి పెనుగోలు కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని,ఇంటి పన్నులు,ఇంటి పట్టాలు,కరెంట్ మీటర్ల సమస్యను పరిష్కరించి, అర్హులందరికీ ఇంటి పన్నులు,కరెంట్ మీటర్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే, ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో బాధితులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంట ఏఎన్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా అధికార ప్రతినిధి పాయం.అజయ్, మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్‌పాల్గొన్నారు.

# ఇండియన్ హైట్స్ విద్యార్థులు కరాటేకు పతకాల పంట

### కరాటే విజేతలకు ఘన సన్మానం.. అభినందించిన ఇండియన్ హైట్స్ యాజమాన్యం






**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలోని ఇండియన్ హైట్స్ స్కూల్ విద్యార్థులు కరాటేలో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఆరో తరగతి విద్యార్థి ఎం.హరిష్ ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో కరాటే కటా ప్రదర్శనలో పాల్గొని రికార్డు సాధనలో భాగస్వామ్యమయ్యాడు. అనంతరం సెప్టెంబర్ 6న ముంబైలోని మిహిర్ సేన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కటా,కుమిటే విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. ఇదే పోటీల్లో మూడో తరగతి విద్యార్థిని రిత్వికా రెడ్డి కటా, కుమిటే విభాగాల్లో మూడో స్థానాన్ని సాధించి ప్రతిభ చాటింది. విద్యార్థుల విజయాలను పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాల చైర్మన్ సజ్జల భువనేశ్వర్ వైస్ చైర్మన్ ద్రాక్షాయణి ,డైరెక్టర్లు మహేష్, విశ్వేశ్వర్,జగదీశ్వర్,సర్టిఫికెట్లతో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ సునీత,కరాటే మాస్టర్ సాయినాథ్,పీఈటీ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం,క్రీడాస్ఫూర్తి పెంపొందుతామని చైర్మన్ సజ్జల భువనేశ్వర్ మరియు మాస్టర్ సాయినాథ్ తెలిపారు.

# రాజాపూర్ మండలంలో భూదాన్,గైరాన్,దేవాదాయ భూముల వివరాల కొరకు ఆర్టిఐ అప్లికేషన్..

### ఆర్టిఐ ద్వారా మండల తహసిల్దార్ ను వివరాలు కోరిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు..


సమాచారం కోసం దరఖాస్తు


తెలుగుదేశం పార్టీ
తెలంగాణ రాష్ట్రం
ఎన్.టి.ఆర్. భవన్,
రోడ్ నెం.2, బంజారా హిల్స్,
హైదరాబాద్ - 500 034.
తేది: 08-01-2026
శ్రీయుత గౌరవనీయులైన మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ గారికి
నమస్కారములు..
పొలిట్‌బ్యూరో సభ్యులు,
జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు,
తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం

గతంలోనూ మహబూబ్ నగర్ కలెక్టర్ కు లేఖ రాసిన బక్కని నరసింహులు

**రాజాపూర్,(ప్రజావినికిడి):** మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలాపూర్, చోకంపేట్,ప్రభుత్వ గైరాన్ భూములు,భూదాన్ భూములు, దేవాదాయ భూముల వివరాలు కోరుతూ సోమవారం రోజున తెలుగుదేశం పార్టీ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ద్వారా రాజాపూర్ మండల తహసీల్దార్ కు ఆర్టిఐ ద్వారా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జడ్చర్ల శాసనసభ్యులు పేర్కొన్న గ్రామాలలోని, అలాగే రాజాపూర్ మండలంలోని ప్రభుత్వ,గైరాన్,భూధాన్,దేవాలయ భూముల వివరాలు ఇవ్వాలని కోరారు. గత శాసనసభ సమావేశాల సందర్భంగా జడ్చర్ల శాసనసభ్యుడు జనంపల్లి అనిరుద్ రెడ్డి అసెంబ్లీ లో తమ నియోజకవర్గంలో భూధాన్, గైరాన్,భూములు పెత్తందార్లపేర్ల పైన చూపెడుతున్నాయని అసెంబ్లీ లో తెలిపారు అని అట్టి భూములను ప్రభుత్వం స్వాధీనపరచుకొని,భూమిని నిరుపేదలను గుర్తించి వారికి అందజేయాలని కోరారు. రాజాపూర్ మండల తాసిల్దార్ ని ఆర్టిఐ ద్వారా అట్టి భూముల వివరాలు కోరడం జరిగిందన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి..

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి..







**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ మొత్తం 89 అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజల నుంచి అర్జీలనుస్వీకరించివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 అర్జీలు,ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు,మొత్తం 89 అర్జీలు అందాయి. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈడీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేతల ధర్నా

**పొంగులేటిపై జరిపిన సోదలోని నివేదికను బయటపెట్టాలని డిమాండ్..**

**ధర్నాలో పాల్గొన్న: ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,శాంబిపూర్ రాజు..**

**ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్ కుమార్,కె.పి వివేకానంద గౌడ్..**

**బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్..**




**హైదరాబాద్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై గతంలో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) జరిపిన దాడుల దర్యాప్తు నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ముందు బీఆర్ఎస్వి,బీఆర్ఎస్వై ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు భారీ నిరసన చేపట్టారు. ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,శంభీపూర్ రాజు,ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్,కె.పి.వివేకానంద్ గౌడ్ విద్యార్థి నాయకులు గెల్లు శ్రీనివాస్ లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఈడీ అధికారులను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఆస్తులపై ఈడీ దాడులు జరిగి రెండేళ్లు గడుస్తున్నా,ఇప్పటివరకు ఆ దర్యాప్తులో ఏం తేలిందనే వివరాలను కేంద్ర ప్రభుత్వం కానీ,ఈడీ కానీ అధికారికంగా ప్రకటించకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సోదాల తాలూకు నివేదికలో ఉన్న నిజాలను తక్షణమే పబ్లిక్ డొమైన్ (ప్రజల అందుబాటు) లో ఉంచాలని వారు తమ వినతి పత్రంలో డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలు దాటినా ఈడీ నిశ్శబ్దంగా ఉండటం వెనుక కేంద్రంలోని బీజేపీ,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందమే కారణమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈడీ నివేదికపై ప్రజలకు పూర్తి క్లారిటీ ఇవ్వాలని,దర్యాప్తు వివరాలను దాచడం సరికాదని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల ధర్నా,వినతి పత్రాల సమర్పణ నేపథ్యంలో ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# సింబయోసిస్ వర్సిటీ వద్ద కబ్జా కోరలు

**పెద్దవాగు పాటుకాలువకే ఎసరు..**

**మొదల్లగూడలో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట..**

**బొల్లం చెరువు కట్ట ధ్వంసమని బక్కని ఆగ్రహం.!**

**వాగులు,కాలువలపై కబ్జాదారుల కన్ను.. బక్కని క్షేత్రస్థాయి పరిశీలన..!**





**షాద్ నగర్, సెప్టెంబర్ 28,** (ప్రజావినికిడి ):వాగులు, కాలువలపై కబ్జాదారుల కన్ను పడిందని ఆరోపిస్తూ నందిగామ మండలం మొదల్లగూడ గ్రామంలో టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. సర్వే నంబర్ 292లోని పాటుకాలువకు అడ్డంగా నిర్మాణాలు వెలిశాయని, పెద్దవాగు, ఈదులవాగు నుంచి బొల్లం చెరువుకు చేరాల్సిన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. వాగులు, కాలువలు, చెరువులు సహజ నీటి ప్రవాహానికి మార్గాలని, వాటిని అడ్డుకునే నిర్మాణాలతో భవిష్యత్తులో సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని బక్కని నరసింహులు అన్నారు. కొన్ని చోట్ల నీటి ప్రవాహం భవనాల కిందుగా వెళ్లేలా నిర్మాణాలు ఉన్నాయని ఆరోపించారు. 2008 జూన్ 11న జారీ చేసిన జీవో నంబర్ 733 ద్వారా నాటి ప్రభుత్వం 40 ఎకరాల భూమిని సింబయోసిస్ యూనివర్సిటీకి అప్పగించిందని ఆయన తెలిపారు. గతంలో గైరాన్ భూములను పేదలకు కేటాయించిన సందర్భాలు ఉన్నాయని, నిర్దిష్ట కాలం సాగు చేయకపోతే భూమిలేని వారికి కేటాయించే నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. బొల్లం చెరువు కట్టను ధ్వంసం చేసి మట్టిని తరలించారని బక్కని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపన్నులు భూముల కోసం దరఖాస్తు చేసుకుంటే పేదల ప్రయోజనాలను పక్కనపెట్టి అధికారులు సులభంగా ఎన్‌ఓసీలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు.


వాగులో బహుళ అంతస్తుల భవన నిర్మాణం

# కృష్ణజింకను వేటాడి మాంసంతో పట్టుబడ్డ తొమ్మిది మంది ముఠా..

**రాయకల్ టోల్‌ప్లాజా వద్ద పోలీస్,ఎస్‌వోటీ,అటవీశాఖ సంయుక్త ఆపరేషన్..**

**లైసెన్స్‌డ్ రైఫిల్,13 కిలోల జింకమాంసం,రెండు లగ్జరీ కార్లు స్వాధీనం..**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ డీసీపీ శిరీష.. రాఘవేందర్..**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** అత్యంత అరుదైన వన్యప్రాణి అయిన కృష్ణజింకను వేటాడి,దాని మాంసాన్ని నగరానికి తరలిస్తున్న తొమ్మిది మంది సభ్యుల ముఠాను షాద్‌నగర్ పోలీసులు,ఎస్‌వోటీ అలాగే అటవీశాఖ అధికారులు సంయుక్త ఆపరేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. నిందితుల నుంచి వేటకు ఉపయోగించిన లైసెన్స్‌డ్ తుపాకీ,బుల్లెట్లు,సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం,రెండు వాహనాలు,నగదు 28.500 మరియు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ శిరీష రాఘవేంద్ర ఈ కేసు వివరాలను అధికారికంగా వెల్లడించారు.

**అర్ధరాత్రి ప్లాన్.. తుపాకీతో వేట**

అధికారుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది నారాయణపేటకు చెందిన ఒక వ్యక్తి,మొత్తం 9తొమ్మిది మంది కలిసి శనివారం (సెప్టెంబర్ 26) అర్ధరాత్రి కార్లలో నారాయణపేట జిల్లా మరికల్ అటవీ ప్రాంతానికి బయలుదేరి వెళ్లారు. ఆదివారం (సెప్టెంబర్ 27) ఉదయం అటవీ ప్రాంతంలో సంచరిస్తూ,తమ వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకీతో ఒక కృష్ణజింకను కాల్చి చంపారు. అనంతరం నిందితులు ఆ జింక మాంసాన్ని ముక్కలుగా నరికి,ప్యాక్ చేసుకునీ హైదరాబాద్ వైపు తిరుగు ప్రయాణమయ్యారు.

**రాయికల్ టోల్‌ప్లాజా వద్ద దొరికిపోయిన ముఠా**

కృష్ణజింక మాంసం తరలింపుపై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు షాద్‌నగర్ పోలీసులు,ఎస్‌వోటీ బృందాలు అలర్ట్ అయ్యాయి..రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టగా నిందితుల వాహనాలు పట్టుబడ్డాయి. పోలీసుల నిఘాకు దొరికిపోయిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, సరదా కోసం తామే ఆ కృష్ణజింకను వేటాడినట్లు అంగీకరించారు.



**కఠిన చట్టాల కింద కేసులు నమోదు**

వన్యప్రాణులను వేటాడటం, చంపడం,వాటి మాంసాన్ని అక్రమంగా తరలించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని డీసీపీ శిరీష రాఘవేంద్ర హెచ్చరించారు. నిందితులు ఎం.డి.హాజీ ఉద్దీన్ (36),మీర్ ముక్తార్ అలీ (37),ఎం.డి. తాజుముల్ (37),మీర్ రాజా అలీ ఖాన్ (39),ఖుర్రం ఖాన్ (35),సయ్యద్ సల్మాన్ అలీ (30),ఎం.డి. అఫ్రోజ్ ఖాన్ (36),ఎం.డి. అబ్దుల్ అజీజ్ (33) అలాగే ఎం.డి.రియాజ్ (28)ల పై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని సెక్షన్లు 9,39,50, 51,57లతో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 30 కింద కఠినమైన కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. అడవుల్లో అక్రమ వేటకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. ప్రజలకు వన్యప్రాణుల వేటపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్లు 1800-425-5364, 040-23231440 కు సమాచారం అందించాలని ఆమె కోరారు. ఈ మీడియా సమావేశంలో డీసీపీతో పాటు ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం,ఎస్‌వోటీ పోలీసులు అదేవిదంగా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# అమెరికాకు ఇరాన్ వార్నింగ్..
## ఈసారి ప్రభాస్ 'బాహుబలి' వీడియోతో!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28 ,(ప్రజావినికిడి):**
అమెరికాకు శక్తివంతమైన హెచ్చరికలు జారీ చేసేందుకు ఇరాన్ మరోసారి తెలుగు సినిమాను వేదికగా ఎంచుకుంది. ఇటీవలే నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' చిత్రంలోని క్లిప్‌ను ఉపయోగించిన ఇరాన్, తాజాగా ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'బాహుబలి' చిత్రంలోని ఒక యాక్షన్ దృశ్యంతో అమెరికాకు తమ సందేశాన్ని పంపింది. హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం సోషల్ మీడియా వేదికగా 'బాహుబలి' చిత్రంలోని ఓ వీడియో క్లిప్‌ను పోస్ట్ చేసింది. బాహుబలి కాలకేయ సైన్యంతో వీరోచితంగా పోరాడే సన్నివేశాన్ని పంచుకుంటూ తమ దేశ వైఖరిని స్పష్టం చేసింది. "మేము ఎవరికీ తలవంచబోమని మా అధ్యక్షుడు పెజెష్కియాన్ ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఇప్పటికే స్పష్టం చేశారు. బాహుబలి కాలకేయులను ఎదిరించినట్లే, మేము కూడా మా మాతృభూమి రక్షణ కోసం రక్తం చిందించడానికైనా, ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నాం" అని ఇరాన్ ఎంబసీ ఆ పోస్టులో పేర్కొంది. కొద్ది రోజుల క్రితం జింబాబ్వేలోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా 'భగవంత్ కేసరి' సినిమాలోని ఒక పోరాట సన్నివేశాన్ని షేర్ చేస్తూ అమెరికాకు పరోక్షంగా హెచ్చరికలు పంపడం గమనార్హం. ఇలా వరుసగా తమ దౌత్యపరమైన హెచ్చరికలకు తెలుగు సినిమాల్లోని శక్తివంతమైన యాక్షన్ సన్నివేశాలను ఉపయోగించుకోవడం ఇప్పుడు అంతర్జాతీయంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

# కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..
## నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28 ,(ప్రజావినికిడి):**



ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# ఆదివారం డ్యూటీ, సోమవారం షాక్..
## సమ్మె వాయిదాపై వెల్లువెత్తిన మీమ్స్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28,(ప్రజావినికిడి):**




దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన బ్యాంకుల సమ్మె వాయిదా పడింది. బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ), 'ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్' (ఐబీఏ) మధ్య ఆదివారం అర్ధరాత్రి జరిగిన చర్చలు ఫలించడంతో యూనియన్లు ఈ కీలక నిర్ణయం తీసుకున్నాయి. దీంతో ఇవాళ్టి నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. నిన్న రాత్రి సుమారు 9:30 గంటలకు యూఎఫ్‌బీయూ, ఐబీఏ ప్రతినిధుల మధ్య సమావేశం జరిగింది. ఈ చర్చల్లో కుదిరిన ఒప్పందం ప్రకారం, బ్యాంకులకు మిగిలిన శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించాలన్న డిమాండ్‌ను పరిశీలించేందుకు తక్షణమే ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. వినియోగదారులు సహా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనడమే లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుంది. దీంతో పాటు గతంలో చర్చించిన ఇతర పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో ప్రతిపాదిత సమ్మెతో పాటు ఇతర ఆందోళన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. ఈ సమ్మె ప్రకటన నేపథ్యంలో వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చాలా బ్యాంకు శాఖలు ఆదివారం కూడా తెరుచుకుని ప్రత్యేకంగా పనిచేశాయి. ఖాతాదారులు తమ లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకున్నారు. అయితే, చివరి నిమిషంలో సమ్మె వాయిదా పడటంతో ఆదివారం పనిచేసిన ఉద్యోగులు ఇప్పుడు పూర్తి వారం విధులకు హాజరుకావాల్సి వస్తోంది. ఈ అనూహ్య పరిణామంపై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. "ఆదివారం ఆఫీస్‌కు వెళ్లొచ్చాం, ఇప్పుడు సమ్మె లేదు" అంటూ ఉద్యోగుల పరిస్థితిపై నెటిజన్లు సరదాగా మీమ్స్, కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఏది ఏమైనా, సమ్మె వాయిదా పడటంతో సాధారణ ప్రజలు, వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఫేస్‌బుక్‌లో మహిళతో పరిచయం...
## రూ.14.61 కోట్లు పోగొట్టుకున్న హైదరాబాద్ డాక్టర్!

**సెప్టెంబర్ 28,(ప్రజావినికిడి):**




ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెట్టిన ఓ దంత వైద్యుడు ఏకంగా రూ.14.61 కోట్లు పోగొట్టుకున్నారు. తెలంగాణలో ఇప్పటివరకు ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని జరిగిన అతిపెద్ద సైబర్ మోసాల్లో ఒకటిగా ఈ ఘటన నిలిచింది. బాధితుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)ని ఆశ్రయించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన 44 ఏళ్ల దంత వైద్యుడికి ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్‌లో 'మోనికా మాధవ్' అనే పేరుతో ఒక మహిళ పరిచయమైంది. తాను చెన్నైకి చెందిన దానినని, విడాకుల ప్రక్రియలో ఉన్నానంటూ సానుభూతి పొందింది. ఆ తర్వాత తనను టెలిగ్రామ్‌లో సంప్రదించాలని కోరి, తాను ట్రేడింగ్ ద్వారా రోజూ రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నట్లు నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వైద్యుడితో **cmcmarketsltd.com** అనే నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లో ఖాతా తెరిపించి, ఆధార్ వివరాలు అప్‌లోడ్ చేయించింది. నమ్మకం కుదిర్చేందుకు, సెప్టెంబర్ 3న వైద్యుడు పెట్టిన రూ.30 లక్షల పెట్టుబడికి రూ.8.6 లక్షలు లాభం వచ్చినట్లు సైట్‌లో చూపించారు. అందులో నుంచి రూ.85,000 విత్‌డ్రా చేసుకునేందుకు కూడా అనుమతించడంతో అతనికి అనుమానం రాలేదు. ఇదే అదనుగా, ఇద్దరం కలిసి రూ.10 కోట్లు పెట్టుబడి పెడదామని ఆమె ప్రతిపాదించింది. దీంతో వైద్యుడు తన వద్ద ఉన్న డబ్బుతో పాటు, అప్పులు చేసి విడతల వారీగా మొత్తం రూ.14.51 కోట్లు డిపాజిట్ చేశాడు. ఆయన ఖాతాలో మొత్తం లాభం రూ.34 కోట్లు ఉన్నట్లు సైట్‌లో కనిపించింది. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, ఆప్షన్ పనిచేయలేదు. డబ్బు రావాలంటే పన్నుల కింద రూ.7.5 కోట్లు చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు డిమాండ్ చేశారు. అదే సమయంలో మోనికా తన కాంటాక్ట్‌లను బ్లాక్ చేసి అదృశ్యమవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై ఐటీ చట్టంలోని సెక్షన్ 66-డీతో పాటు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితుడు 91 సార్లు డబ్బు బదిలీ చేసినట్లు, ఆ మొత్తం 10 రాష్ట్రాల్లోని 40 బ్యాంకు ఖాతాలకు మళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. టీజీసీఎస్‌బీ అధికారులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# భూముల రక్షణ కోసం సుప్రీం కోర్టుకు
# 2,500 మంది ఆదివాసీలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28 ,(ప్రజావినికిడి):**





తమ పూర్వీకుల భూములను ఆక్రమణలు, బదలాయింపుల నుంచి కాపాడుకోవడానికి ఏపీకి చెందిన 2,500 మంది షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన రైతులు ఒకే తాటిపైకి వచ్చి సుప్రీం కోర్టును ఆశ్రయించారని న్యాయవాది అల్లంకి రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గిరిజనులకు ఈ భూములు కేవలం ఆస్తులు కాదని, వారి సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని పేర్కొన్నారు. అందుకే వీరు తమ హక్కుల సాధన కోసం సుదీర్ఘ న్యాయపోరాటానికి దిగారని వివరించారు.

కాగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 24, 19(5), 5 షెడ్యూల్ ఆధారంగా గిరిజనులకు లభించిన ప్రత్యేక హక్కులను కాపాడాలని వర్న రాంబాబు, ఆధార్ సొసైటీ సభ్యులతో కలిసి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టపరమైన సవాలు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు నియంత్రణ చట్టం (1/70 యాక్ట్) పై ఆధారపడి ఉంది. గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు 'పి. రామిరెడ్డి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (1988) 3 ాజజ 433' కేసులో మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. గిరిజనుల సామాజిక-ఆర్థిక మనుగడను కాపాడాలనే లక్ష్యంతో గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు జరిగే భూ బదలాయింపులపై ఉన్న సంపూర్ణ నిషేధాన్ని ఆనాడు సుప్రీంకోర్టు సమర్థించింది.

1978లోని 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 19(1)(ట) కింద ఉన్న ఆస్తి ప్రాథమిక హక్కును రద్దు చేశారని, కేవలం గిరిజనులకు మాత్రమే ఆర్టికల్ 244, 19(5), 5వ షెడ్యూల్ కింద ప్రత్యేక హక్కులు ఉన్నాయని 1988 తీర్పులోనే అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసినట్లు పిటిషనర్లు గుర్తుచేశారు.

**గిరిజనుల భూములకు ఎందుకు ప్రత్యేక రక్షణ?**

ఈ సందర్భంగా పిటిషనర్లు గిరిజనుల భూములకు ఎందుకు ప్రత్యేక రక్షణ అవసరమో వివరించారు. 'గిరిజనులు తరతరాలుగా అటవీ ప్రాంతంలోనే నివసిస్తున్నారు. 1874 నుంచి 1950 మధ్య కాలంలో నిరక్షరాస్యత, పేదరికం, అవగాహన లేమి కారణంగా భూస్వాములు, వడ్డీ వ్యాపారులు తదితర గిరిజనేతరుల చేతిలో గిరిజనులు దోపిడీకి గురయ్యారు. ఈ పరిస్థితుల నుంచి అమాయక గిరిజనులను కాపాడేందుకు ప్రభుత్వం 1/1959 రెగ్యులేషన్, ఆ తర్వాత సవరించిన 1/70 రెగ్యులేషన్ ద్వారా రక్షణ కల్పించింది' అని పిటిషనర్లు తెలిపారు.

**సుప్రీం కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు..**

కొందరు గిరిజనేతరులు సుప్రీం కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. 1970 తరువాత గిరిజన ప్రాంతానికి వలస వచ్చిన వీరు.. నిరక్షరాస్యులైన గిరిజనుల భూములను ఆక్రమించారని చెప్పారు. అయితే యారంశెట్టి సత్యనారాయణ, సూరిరెడ్డి రమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో రద్దయిన ఆర్టికల్ 19(1)(ఎఫ్)ను ఆధారంగా చూపిస్తూ 1/70 చట్టంలోని సెక్షన్ 3(1)(ఏ)ను రద్దు చేయాలని కోరడం కోర్టును తప్పుదోవ పట్టించడమేనని వివరించారు. అందుకే ఈ అక్రమ పిటిషన్‌ను వెంటనే కొట్టివేయాలని 2,500 మంది ఆదివాసీలు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

# డబ్ల్యూఏపీఎల్ విజేత రాయలసీమ జెన్ స్టార్స్
## మంత్రి నారా లోకేశ్ అభినందనలు

**సెప్టెంబర్ 28,(ప్రజావినికిడి):**




ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహించిన మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) తొలి సీజన్ విజేతగా రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు నిలిచింది. మంగళగిరిలో నిన్న రాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గోదావరి గోల్డెన్ ఈగిల్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయం పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్ విజయంపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. డబ్ల్యూఏపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన రాయలసీమ జెన్ స్టార్స్ జట్టుకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదే సమయంలో, ఫైనల్లో చివరి వరకు పోరాడిన రన్నరప్ గోదావరి గోల్డెన్ ఈగిల్స్ జట్టు ప్రదర్శించిన స్ఫూర్తిని కూడా ఆయన కొనియాడారు. "తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఛాంపియన్‌గా నిలిచిన రాయలసీమ జెన్ స్టార్స్‌కు అభినందనలు. రన్నరప్‌గా నిలిచిన గోదావరి గోల్డెన్ ఈగిల్స్ కూడా అద్భుతమైన పోరాటపటిమను కనబరిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న మహిళా క్రికెటర్లలోని ప్రతిభను వెలికితీసి, వారికి ప్రోత్సాహం అందించేందుకు డబ్ల్యూఏపీఎల్ ఒక అద్భుతమైన వేదికను సృష్టించిందని మంత్రి ప్రశంసించారు. ఈ టోర్నమెంట్‌ను ఇంత విజయవంతంగా నిర్వహించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) బృందాన్ని, నిర్వాహకులను ఆయన అభినందించారు. రాష్ట్రంలో క్రీడలకు, క్రీడాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. తొలి సీజన్ విజయవంతం కావడంతో భవిష్యత్తులో మరిన్ని జట్లతో ఈ టోర్నీని మరింత వైభవంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది.

# బ్యాంకు మూసేస్తే పుట్టిన ఆలోచన...

**ఏటీఎం వెనుక ఆసక్తికర కథ!**

**బ్యాంకు మూసేయడంతో వచ్చిన ఆలోచనే ఏటీఎం**

**చాక్లెట్ వెండింగ్ మెషిన్ స్ఫూర్తితో ఏటీఎం ఆవిష్కరణ**

**1967లో లండన్‌లో బార్క్లేస్ బ్యాంకు తొలి ఏటీఎం ఏర్పాటు**

**తొలినాళ్లలో ప్లాస్టిక్ కార్డులకు బదులు పేపర్ వోచర్లు వినియోగం**

**బ్యాంకింగ్ వేళలతో సంబంధం లేకుండా నగదు విత్ డ్రా సౌకర్యం**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28,(ప్రజావినికిడి):**






ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన 'ఆటోమేటెడ్ టెల్లర్ మెషిన్' (ఏటీఎం) ఆవిష్కరణ వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. బ్యాంకు పనివేళలు ముగిసిన తర్వాత డబ్బు తీసుకోలేకపోయాననే ఒక వ్యక్తి అసహనమే ఈ అద్భుత ఆవిష్కరణకు దారితీసింది. ఆ వ్యక్తి స్కాట్లాండ్‌కు చెందిన ఆవిష్కర్త జాన్ షెపర్డ్-బ్యారన్. ఆయనకు ఎదురైన ఒక చిన్న అనుభవమే ప్రపంచ రిటైల్ బ్యాంకింగ్ స్వరూపాన్ని శాశ్వతంగా మార్చేసింది. 1960వ దశకం మధ్యలో బ్యాంకులు పరిమిత గంటలు మాత్రమే పనిచేసేవి. శని, ఆదివారాలు వస్తే నగదు తీసుకోవడం దాదాపు అసాధ్యం. ఆ రోజుల్లో నోట్ల తయారీ సంస్థ 'డీ లా రూ'లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న షెపర్డ్-బ్యారన్, ఒక శనివారం తన చెక్కును క్యాష్ చేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లారు. కానీ, అప్పటికే బ్యాంకు మూసేశారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎప్పుడైనా, ఎక్కడైనా మన డబ్బును మనమే తీసుకునేలా ఒక యంత్రం ఎందుకు ఉండకూడదు? అనే ఆలోచన ఆయన మదిలో మెదిలింది. రైల్వే ప్లాట్‌ఫారమ్‌లపై ఉండే చాక్లెట్ వెండింగ్ మెషిన్ల నుంచి స్ఫూర్తి పొంది, అలాంటిదే డబ్బు ఇచ్చే యంత్రాన్ని తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. తన ఆలోచనను బార్క్లేస్ బ్యాంకుతో పంచుకోగా, వారు దీనికి అంగీకరించారు. షెపర్డ్-బ్యారన్ బృందం పగలు, రాత్రి కష్టపడి తొలి ఏటీఎం యంత్రాన్ని అభివృద్ధి చేసింది.

1967 జూన్ 27న లండన్‌లోని ఎన్‌ఫీల్డ్‌లో ఉన్న బార్క్లేస్ బ్రాంచ్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి క్యాష్ డిస్పెన్సర్‌ను ఆవిష్కరించారు. అయితే, ఇప్పటిలా అప్పట్లో ప్లాస్టిక్ కార్డులు లేవు. స్వల్పస్థాయి రేడియోధార్మిక పదార్థంతో కూడిన ప్రత్యేక పేపర్ వోచర్లను ఉపయోగించి డబ్బు విత్‌డ్రా చేసేవారు. దీని ద్వారా ఒకేసారి గరిష్ఠంగా 10 పౌండ్ల వరకు మాత్రమే తీసుకునే వీలుండేది.

ఈ యంత్రంతోనే వ్యక్తిగత గుర్తింపు సంఖ్య (పిన్) విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టారు. మొదట 6 అంకెల పిన్‌ను సూచించినా, తన భార్య సలహాతో నాలుగు అంకెలు అయితే సులభంగా గుర్తుంటాయని బ్యారన్ దానినే ఖరారు చేశారు. ఈ ఆవిష్కరణ తర్వాత బ్యాంకింగ్ వేళలతో సంబంధం లేకుండా వినియోగదారులు నగదు పొందే సౌలభ్యం ఏర్పడింది. కేవలం ఒక వ్యక్తికి ఎదురైన చిన్న అసౌకర్యం, ప్రపంచవ్యాప్త బ్యాంకింగ్ వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నెట్‌ఫ్లిక్స్‌లోకి మెగాస్టార్ చిరంజీవి.. పాడ్‌కాస్ట్‌తో సరికొత్త ప్రయాణం!



తెలుగు చిత్రసీమలో దాదాపు 48 ఏళ్లుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త బాటలో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. వెండితెరపై తన మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనదైన ముద్ర వేయనున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఆయన ఒక ప్రత్యేకమైన పాడ్‌కాస్ట్ సిరీస్ చేయబోతున్నారు.తొలుత చిరంజీవి జీవిత ప్రస్థానంపై ఒక డాక్యుమెంటరీని రూపొందించాలని భావించినప్పటికీ, పాడ్‌కాస్ట్ అయితే తన భావాలను మరింత స్వేచ్ఛగా, నేరుగా పంచుకోవడానికి వీలుంటుందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. ఈ వినూత్న ఆలోచనను ఆయన కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెలతో పాటు ప్రముఖ రచయిత బీవీఎస్ రవి ప్రతిపాదించగా, చిరంజీవి వెంటనే అంగీకరించినట్లు సమాచారం.ఇప్పటికే పలు విజయవంతమైన టాక్ షోలకు పనిచేసిన అనుభవం ఉన్న బీవీఎస్ రవి ఈ ప్రాజెక్టుకు రచన, రూపకల్పన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాధారణ ఇంటర్వ్యూలలో పంచుకోని ఎన్నో వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలు, స్టార్‌డమ్ వెనుక ఉన్న శ్రమ, సినీ ప్రస్థానంలోని ఎత్తుపల్లాలను ఈ పాడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి అభిమానులతో పంచుకోనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే విడుదల చేయనుందని తెలుస్తోంది.

# మళ్ళీ అమ్మ సెంటిమెంట్ తో పూరి..

పూరీ జగన్నాథ్.. పేరు వింటేనే ఒక డిఫరెంట్ మేనరిజం, రా యాటిట్యూడ్ గుర్తొస్తాయి. ఆయన హీరోలు సమాజంతో గొడవ పడే విధానం చాలా కొత్తగా ఉంటుంది. కానీ ఈసారి పూరీ తన ట్రాక్ మార్చాడని తెలుస్తోంది. వరుస అప్డేట్స్ తో హీరో బిచ్చగాడిగా ఎలా మారాడు అనే కోణంలో క్యూరియాసిటి క్రియేట్ చేస్తున్నాడు. ‘స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్‘ అనే టైటిల్ తోనే తన మార్క్ చూపించాడు. ఇక లేటెస్ట్ గా మరో గ్లింప్స్ వదిలారు. ఇందులో హీరో యాటిట్యూడ్ కన్నా ఎక్కువగా, ఒక బలమైన మదర్ సెంటిమెంట్ చుట్టూ కథను తిప్పబోతున్నట్లు హింట్ ఇచ్చారు. పూరి సినిమాల్లో మదర్ సెంటిమెంట్ కూడా డిఫరెంట్ గానే ఉంటుంది. చిరుత, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, లోఫర్, రోగ్, లైగర్.. ఇలా ఎక్కువ సినిమాల్లో అమ్మ ఎమోషన్ ను హైలెట్ చేశారు. ఇక ఈ సినిమాలో సీనియర్ నటి జరీనా వహాబ్ తల్లిగా ‘జుబేదా‘ అనే పాత్రలో నటిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో ఆమె క్యారెక్టర్ ను పరిచయం చేసిన విధానం గుండెను మెలిపెట్టేలా ఉంది. ట్రైన్ కింద తలపెట్టి చనిపోదాం అనుకున్నా, ఆ ధైర్యం




సరిపోలేదని, ఆకలితో ప్రాణాలు పోతుంటే ఆఖరికి తన చేతులు అడుక్కోవడానికి ముందుకొచ్చాయని జుబేదా పాత్ర చెప్పే డైలాగ్స్ చాలా బరువైన ఎమోషన్‌ను క్యారీ చేస్తున్నాయి. దీని తర్వాత విజయ్ సేతుపతి ఎంట్రీ ఇవ్వడం చూస్తుంటే తల్లి కోసం ఏమైనా చేస్తాడా అనే క్యూరియాసిటి క్రియేట్ అయ్యింది. ‘అమ్మ ఉన్నది అన్నం పెట్టడానికి, అడుక్కోవడానికి కాదు‘ అని పూరి వాయిస్ ఓవర్ హైలెట్ అయ్యింది. అంటే ఆకలి కోసం బిచ్చగత్తెగా మారిన ఒక తల్లి, ఆ తల్లి పడే బాధను చూడలేక రగిలిపోయే కొడుకు.. ఈ ఇద్దరి మధ్య పూరీ జగన్నాథ్ ఎలాంటి కథను రాశాడో అని ఆలోచిస్తే చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది. కచ్చితంగా ఈసారి పూరీ తన మార్క్ మాస్ ఎలిమెంట్స్‌కు ఒక గట్టి సెంటిమెంట్‌ను జోడించబోతున్నట్లు కనిపిస్తోంది. చివరగా ఇస్మార్ట్ శంకర్ లాంటి ఊర మాస్ సినిమాతో హిట్ కొట్టిన పూరీ, ఆ తర్వాత వరుస పరాజయాలతో ఇబ్బంది పడ్డాడు. కానీ ఈసారి ఆ తప్పులు జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఈ గ్లింప్స్ క్వాలిటీ చూస్తే తెలుస్తోంది. ముఖ్యంగా పూరీ డైలాగ్స్‌లో ఉండే పదును ఈ వీడియోలోనూ తగ్గలేదు. ఛార్మి కౌర్, జేబీ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో పూరీ మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరి ఈ ప్రయోగం ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలి. టబు కూడా ఇందులో ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు.

# టెక్నాలజీ, మన కథలు... ఇదే భారత సినిమా భవిష్యత్తు : నాగ్ అశ్విన్



భారీ బడ్జెట్ చిత్రం ‘కల్కి 2898 ఏడీ‘తో జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటిన దర్శకుడు నాగ్ అశ్విన్, భారత సినిమా భవిష్యత్తుపై తన ఆలోచనలను పంచుకున్నారు. మన దేశానికే ప్రత్యేకమైన కథలు, పురాణాలకు ఆధునిక టెక్నాలజీని జోడించడం ద్వారా భారత సినిమా సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇటీవల ‘కల్కి‘ చిత్రానికి 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో భాగంగా ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో అవార్డులు లభించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. “మన కథలు, మన తత్వశాస్త్రానికి టెక్నాలజీని జోడించడం ద్వారా భారతీయ సినిమాకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. ఇది కచ్చితంగా నిజం“ అని ఆయన స్పష్టం చేశారు.టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం వల్ల మరింత మంది సృజనకారులు తమ ఆలోచనలను తెరపైకి తీసుకురాగలరని నాగ్ అశ్విన్ అన్నారు. “ఈ సాంకేతికత ఎంత సులభంగా అందుబాటులోకి వస్తే, అంత వైవిధ్యమైన, అసలైన గొంతుకలకు బలం చేకూరుతుంది. ఇది ఎక్కువ మంది తమ కథలను తమదైన రీతిలో చెప్పడానికి వీలు కల్పిస్తుంది“ అని ఆయన వివరించారు.‘కల్కి 2898 ఏడీ‘ 2024లో విడుదలైన ఒక మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ చిత్రం. హిందూ పురాణాల స్ఫూర్తితో, 2898 నాటి కాశీ నగరంలో ఈ కథ నడుస్తుంది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, శోభన వంటి భారీ తారాగణం ఇందులో నటించారు. శేఖర్ కమ్ముల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన నాగ్ అశ్విన్, 2018లో నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తీసిన ‘మహానటి‘ చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే.

# సూర్యతో సినిమాపై నోరు విప్పిన రాజమౌళి



ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని చాటిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, విలక్షణ నటుడు సూర్య కాంబినేషన్‌లో సినిమా వస్తే చూడాలని అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబోపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. సూర్యతో సినిమా చేస్తే అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా (స్పెషల్) ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఆ విషయం గురించి మాట్లాడటానికి ఇది సరైన సమయం కాదని సున్నితంగా దాటవేశారు.ఇటీవల మలయాళ నటుడు ఫహాద్ ఫాసిల్ నటించిన ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్‘ అనే సినిమా ప్రీ-రిలీజ్ వేడుకకు రాజమౌళి, సూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు రాజమౌళి సమాధానమిచ్చారు. “మీరు ఈ ప్రశ్న అడుగుతారని ఊహించే ఇక్కడికి వచ్చాను. దానికి సమాధానం కూడా సిద్ధం చేసుకున్నాను. కానీ, మనం ఇక్కడికి వచ్చింది ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్‘ సినిమాను ప్రమోట్ చేయడానికి. ఇప్పుడు నేను, సూర్య సినిమా గురించి మాట్లాడితే, అదే హెడ్‌లైన్ అవుతుంది. అసలు సినిమా పక్కకు వెళ్లిపోతుంది. అది సరికాదు“ అని అన్నారు.అదే సమయంలో అభిమానులకు భరోసా ఇస్తూ.. “మేమిద్దరం కలిసి ఎప్పుడు సినిమా చేసినా, అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా ఉంటుంది“ అని చెప్పడంతో సూర్య అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అంతటితో ఆగకుండా సూర్యను రాజమౌళి అభినందనలతో ముంచెత్తారు. ఇటీవల ‘కరుప్పు‘, ‘విశ్వనాథ్ అండ్ సన్స్‘ వంటి చిత్రాలతో వరుస విజయాలు సాధించడం ‘డబుల్ ధమాకా‘ అని ప్రశంసించారు. అలాగే, జితూ మాధవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న ‘సీన్‘ సినిమా ప్రచార చిత్రాలు కూడా అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు.గతంలో రాజమౌళి దర్శకత్వంలో నటించే ఒక అవకాశాన్ని తాను కోల్పోయానని, ఆయనతో కలిసి పనిచేయాలని ఉందని పలు ఇంటర్వ్యూలలో సూర్య స్వయంగా చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాజమౌళి వ్యాఖ్యలతో ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రావడం ఖాయమనే అంచనాలు మరింత బలపడ్డాయి.

# అది హనుమాన్ టెంపుల్ కాదు.. శిరీష్ ఫిర్యాదుపై పోలీసులు!



హీరో అల్లు శిరీష్ చేసిన డీజే సౌండ్ ఫిర్యాదుపై సైబరాబాద్ పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి వరకు భారీ శబ్దాలతో ఇబ్బంది కలుగుతోందంటూ శిరీష్ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ శబ్దాలకు హనుమాన్ ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై అల్లు శిరీష్‌తో మాట్లాడినట్లు పోలీసులు వెల్లడించారు. సదరు శబ్దాలు గణేశ్ నిమజ్జనం ఊరేగింపు నుంచి వచ్చాయని, హనుమాన్ ఆలయం నుంచి కాదని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులతో కూడా చర్చించామని, ఇప్పటికే నిమజ్జనం పూర్తయిందని వారు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.కొన్ని రోజుల క్రితం, తన నివాసం సమీపంలోని ఒక హనుమాన్ ఆలయం వద్ద అర్ధరాత్రి వరకు డీజే సౌండ్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారంటూ అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేశారు. ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు లోతుగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించారు. పోలీసుల తాజా వివరణతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.



# ఫౌజీ‘ బ్యూటీ సౌండింగ్ లేదే!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న -పౌజీ- సినిమాలో ఛాన్స్ అందుకుని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది ఇమ్మాన్వీ ఇస్మైల్. డార్లింగ్ సరసన నటించాలని ఎంతో మంది ఫేమస్ బ్యూటీలో రేసులో ఉన్నా? వాళ్లందర్నీ పక్కనబెట్టి మరీ దర్శకుడు హను రాఘవపూడి ఇమ్మాన్విని ఎంపిక చేసారు. అందుకు తగ్గట్టే అమ్మడు మంచి ట్యాలెంటెడ్. డాన్సింగ్ స్కిల్స్ తో ఇప్పటికే లక్షల్లో ఫాలోవర్లను సంపాదించుకుంది. నటన పరంగా అమ్మడు ఎలాంటి పెర్ఫార్మర్ అన్నది పౌజీతో ప్రూవ్ అవ్వాలి. ఈ బ్యూటీ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో మెరిసిన క్షణం నుంచి టాలీవుడ్ వ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. హను రాఘవపూడి కథానాయికలను వెండితెరపై ఎంత అందంగా, వైవిధ్యంగా చూపిస్తారో -సీతారామం-తో నిరూపితమవ్వడంతో ఇమ్మాన్వీ పై కూడా అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆమె పాత డ్యాన్స్ వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. టాలీవుడ్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చేసిందంటూ ట్రేడ్ వర్గాలు కూడా భావించాయి. అయితే ఆరంభంలో కనిపించిన ఆ హడావుడి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. -ఫౌజీ- అనౌన్స్‌మెంట్ తర్వాత ఇమ్మాన్వీ నుంచి ఎలాంటి పెద్ద చప్పుడు లేదు. కొత్తగా ఆమె వేరే ఏ తెలుగు ప్రాజెక్ట్‌కూ సైన్ చేసినట్లు ప్రచారం జరగకపోవడం.. అలాగే టాలీవుడ్ ఈవెంట్లలో గానీ, సర్కిల్స్‌లో గానీ అమ్మడి పేరు ఎక్కడా పెద్దగా వినిపించ కపోవడంతో ఫౌజీ బ్యూటీ లైనప్ స్తబ్దుగా మారిందనే చర్చ మొదలైంది..సాధారణంగా ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ సరసన అవకాశం వస్తే ఇతర నిర్మాతలు, దర్శకులు ఆ కథానాయికతో సినిమాలు చేసేందుకు క్యూ కడుతుంటారు. ఆ క్రేజ్‌ను వాడుకుని వరుసగా ప్రాజెక్ట్‌లు దక్కించుకోవడం ఇండస్ట్రీలో సహజంగా జరిగే ప్రక్రియ. కానీ ఇమ్మాన్వీ మాత్రం అందుకు భిన్నంగా సైలెంట్‌గా మొదటి సినిమాపైనే పూర్తి దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613